

# ఇదినిజం

RNI Regd.No: APTEL/2012/45871

WWW.IDHINIJAM.COM

సాయంకాలం దినపత్రిక

పొట్టిశ్రీరాములు నెల్లూరు | సంపుటి : 20 | సంచిక: 42 | ఎడిటర్: మాదాల వెంకటశేషగిరి | సోమవారం 26 అక్టోబర్ 2026 | పేజీలు : 08 | వెల: 02


# అర్నబ్ అలజడి



## ఏపీకి పెను తుపాను ముప్పు

- మూడు రోజులపాటు 12 జిల్లాల్లో అతి భారీ వర్షా లు
- గంటకు 115 నుంచి 125 కి.మీ. వేగంతో గాలులు.. గరిష్ఠంగా 140 కి.మీ. వేగం
- బాపట్ల - విశాఖ మధ్య తీరాన్ని దాటే అవకాశం
- అప్రమత్తమైన రాష్ట్ర ప్రభుత్వం
- మత్స్యకారులను వేటకు వెళ్లవద్దని హెచ్చరికలు
- లోతట్టు ప్రాంతాల ప్రజలను తరలించేందుకు ఏర్పాట్లు
- పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్న చంద్రబాబు
- తెలంగాణలోనూ మోస్తరు నుంచి భారీ వర్షా లకు చాన్స్



బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం క్రమంగా బలపడుతూ ఆంధ్రప్రదేశ్ వైపు దూసుకొస్తోంది. 'అర్నబ్'గా పేర్కొంటున్న ఈ తుపాను తీవ్రరూపం దాలిస్తే తీరప్రాంతాలకు పెను ముప్పు పొంచి ఉందన్న అంచనాలు ఆందోళన కలిగిస్తున్నాయి. భారీ వర్షా లు, భీకర గాలులు, సముద్రంలో అలజడి.. వెరసి రాష్ట్ర యంత్రాంగం అప్రమత్తమైంది. ఈ నెల 28న బాపట్ల - విశాఖపట్నం మధ్య తీరాన్ని దాటే అవకాశం ఉందన్న అంచనాల నేపథ్యంలో ప్రజలను ముందస్తుగా అప్రమత్తం చేస్తున్నారు. మత్స్యకారులు సముద్రంలోకి వెళ్లవద్దని హెచ్చరిస్తున్నారు. లోతట్టు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు అధికారులు సిద్ధమవుతున్నారు.

### బంగాళాఖాతంలో బలపడుతున్న తుపాను

ఆగ్నేయ బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం వాయుగుండంగా బలపడింది. వాతావరణ శాఖ సమాచారం ప్రకారం, ఇది పశ్చిమ వాయవ్య దిశగా కదులుతూ మరింత బలపడే అవకాశం ఉంది. తదుపరి దశల్లో తీవ్ర వాయుగుండంగా, తుపానుగా, ఆపై తీవ్ర తుపానుగా మారవచ్చని అంచనా వేస్తున్నారు. అక్టోబర్ 28 ఉదయం నాటికి ఆంధ్రప్రదేశ్ తీరానికి సమీపించి బాపట్ల విశాఖపట్నం మధ్య తీరం దాటే అవకాశాన్ని వాతావరణ శాఖ అంచనా వేసినట్లు సమాచారం. అయితే తుపాను ప్రయాణించే మార్గం, తీవ్రత, తీరం దాటే ప్రాంతం తాజా వాతావరణ బులెటిన్లను బట్టి మారవచ్చు. తీరం దాటే సమయంలో గంటకు 115 నుంచి 125 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచే అవకాశం ఉందని, గరిష్ఠంగా గంటకు 140 కిలోమీటర్ల వేగాన్ని అందుకోవచ్చని అధికారులు హెచ్చరించినట్లు సమాచారం. తీరప్రాంతాల్లో ఈదురుగాలులు, భారీ వర్షాలు, చెట్లు కూలడం, విద్యుత్ సరఫరాకు అంతరాయం వంటి సమస్యలు తలెత్తే ప్రమాదం ఉంది.

### 12 జిల్లాల్లో భారీ వర్షా లు

తుపాను ప్రభావంతో కోస్తాంధ్రలోని పలు జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. ముఖ్యంగా విశాఖపట్నం, అనకాపల్లి, కాకినాడ, తూర్పుగోదావరి, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ, పశ్చిమగోదావరి, ఏలూరు, బాపట్ల, గుంటూరు, ఎన్టీఆర్, కృష్ణా జిల్లాల్లో వర్షాల తీవ్రత ఎక్కువగా ఉండవచ్చని అంచనా వేస్తున్నారు. అల్లూరి సీతారామరాజు, పార్వతీపురం మన్యం, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల్లోనూ భారీ వర్షాలు కురిసే అవకాశముందని హెచ్చరికలు వెలువడ్డాయి. పల్నాడు, ప్రకాశం, శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాల్లోనూ వర్ష ప్రభావం కనిపించవచ్చని సమాచారం. తుపాను తీరం దాటిన తర్వాత కూడా వర్షాలు వెంటనే తగ్గకపోవచ్చని అంచనా. అక్టోబర్ 29న ఏలూరు, పశ్చిమగోదావరి, అల్లూరి సీతారామరాజు, విశాఖపట్నం, అనకాపల్లి, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల్లో వర్షాలు కొనసాగవచ్చని వాతావరణ శాఖ సూచించినట్లు సమాచారం.

అమరావతి, (ఇదినిజం ప్రతినిధి):




### రంగంలోకి ప్రభుత్వ యంత్రాంగం

తుపాను ముప్పు నేపథ్యంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, రియల్ టైమ్ గవర్నెన్స్ సొసైటీ ప్రతినిధులతో పరిస్థితిని సమీక్షించి, ముందస్తు చర్యలపై అధికారులకు ఆదేశించారు. ప్రజలకు ఎప్పటికప్పుడు వాతావరణ హెచ్చరికలు చేరవేయాలని, తీరప్రాంతాల్లో అప్రమత్తత పెంచాలని, అత్యవసర పరిస్థితులను ఎదుర్కొనేందుకు శాఖల మధ్య సమన్వయం ఉండాలని ప్రభుత్వం సూచించింది. లోతట్టు ప్రాంతాల్లో నివసించే ప్రజలను అవసరమైతే సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు ఏర్పాట్లు చేయాలని అధికారులను కోరారు.. అత్యవసర సహాయక బృందాలు సిద్ధంగా ఉండటం, సహాయక శిబిరాలను గుర్తించడం, తాగునీరు, ఆహారం, మందులు అందుబాటులో ఉంచడం వంటి చర్యలు తుపాను సమయంలో కీలకం కానున్నాయి. భారీ వర్షాల కారణంగా రహదారులు దెబ్బతిన్నా, విద్యుత్ సరఫరా నిలిచిపోయినా ప్రజలకు తక్షణ సహాయం అందేలా యంత్రాంగం సిద్ధంగా ఉండాల్సి ఉంది.

### మత్స్యకారులకు హెచ్చరికలు

తుపాను ప్రభావంతో సముద్రం అల్లకల్లోలంగా మారే అవకాశం ఉన్నందున మత్స్యకారులు వేటకు వెళ్లవద్దని అధికారులు సూచిస్తున్నారు. ఇప్పటికే సముద్రంలో ఉన్నవారు సురక్షితంగా తీరానికి చేరుకోవాలని హెచ్చరిస్తున్నారు. తీరప్రాంత ప్రజలు సముద్రం వద్దకు వెళ్లడం, అలల ఉద్ధృతిని చూసేందుకు ప్రమాదకర ప్రాంతాల్లో గుమిగూడడం వంటి చర్యలకు దూరంగా ఉండాలి. బలమైన గాలుల సమయంలో చెట్ల కింద, విద్యుత్ స్తంభాల సమీపంలో నిలబడకూడదు. ఇళ్లలోకి వర్షపు నీరు చేరే అవకాశం ఉన్న ప్రాంతాల్లో ముందుగానే అవసరమైన వస్తువులు సిద్ధం చేసుకోవాలి. లోతట్టు ప్రాంతాల ప్రజలు అధికారుల సూచనలను పాటించి, తరలింపు ఆదేశాలు వస్తే ఆలస్యం చేయకుండా సురక్షిత ప్రాంతాలకు వెళ్లడం అత్యంత ముఖ్యం.

### తెలంగాణపై తుపాను ప్రభావం

ఆంధ్రప్రదేశ్ వైపు కదులుతున్న తుపాను ప్రభావం తెలంగాణలోనూ కనిపించే అవకాశం ఉందన్న అంచనాలు వెలువడ్డాయి. ముఖ్యంగా ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే సూచనలు ఉన్నట్లు సమాచారం. జయశంకర్ భూపాలపల్లి, మహబూబాబాద్, వరంగల్, హనుమకొండ, సూర్యాపేట జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేసినట్లు సమాచారం. హైదరాబాద్‌లోనూ మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు.

## విజయవంతంగా 'ఆపరేషన్ ట్రైడెంట్'..

### రూ.100 కోట్ల హవాలా గుట్టు రట్టు



ఢిల్లీ (ఇదినిజం ప్రతినిధి): దేశంలో మాదక ద్రవ్యాల రవాణా, విక్రయాలపై కేంద్రం పంజా విసిరింది. దాదాపు 3 రాష్ట్రాల్లో ఏకకాలంలో ఆపరేషన్లు నిర్వహించి 18 మంది అంతర్జాతీయ డ్రగ్స్ మాఫియా సభ్యులను అరెస్ట్ చేసింది. వివరాల్లోకి వెళితే.. 2029 డిసెంబర్ 31 నాటికి దేశాన్ని 'డ్రగ్స్ రహిత భారత్' గా రూపొందించాలనే లక్ష్యంతో కేంద్ర హోంశాఖ చేపట్టిన 'ఆపరేషన్ ట్రైడెంట్' విజయవంతంగా ముందుకు సాగుతోంది. భారత్, మయన్మార్, బంగ్లాదేశ్ సరిహద్దుల గుండా కొనసాగుతున్న అంతర్జాతీయ డ్రగ్స్ స్మగ్లింగ్‌ను పూర్తిగా తుడిచివేయడానికి ప్రభుత్వం ఈ ఆపరేషన్ చేపట్టింది. ఇందులో భాగంగా మణిపూర్, అసోం, మిజోరం 3 రాష్ట్రాల్లోని 38 ప్రాంతాల్లో ఏకకాలంలో దాడులు నిర్వహించింది. విజయవంతంగా కొనసాగిన ఈ ఆపరేషన్‌లో పోలీసులు అంతర్జాతీయ డ్రగ్స్ స్మగ్లింగ్ నెట్‌వర్క్‌ను ఛేదించారు. రూ.100 కోట్ల హవాలా గుట్టును రట్టు చేసి 1,424 బ్యాంక్ అకౌంట్లను సీజ్ చేశారు. 18 మంది అంతర్జాతీయ డ్రగ్స్ స్మగ్లర్లను అరెస్ట్ చేసి వారి నుంచి 500 డిటొనేటర్లు స్వాధీనం చేసుకున్నారు.

## కూటమి ఖాతాలోకి కడప.. 50 డివిజన్‌లు ఏకగ్రీవం



కడప, (ఇదినిజం ప్రతినిధి): :కడప నగరపాలక సంస్థ ఎన్నికల్లో అధికార కూటమి అభ్యర్థులు హవా కొనసాగించారు.. కార్పొరేషన్ పరిధిలోని మొత్తం స్థానాల్లో ఏకంగా 50 డివిజన్లు ఏకగ్రీవంగా కూటమి కైవసమయ్యాయి. టీడీపీ అభ్యర్థులు ఏకంగా 47 డివిజన్లలో ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. బీజేపీ అభ్యర్థులు 2 డివిజన్లలో ఏకగ్రీవం సాధించగా, జనసేన పార్టీ ఒక డివిజన్‌లో విజయాన్ని సొంతం చేసుకుంది. నగరపాలక సంస్థలోని 50 స్థానాలు ఏకగ్రీవం కాగా, మిగిలిన 16 డివిజన్లతో పాటు అత్యంత కడప మేయర్ స్థానానికి మాత్రమే ఇప్పుడు ఎన్నికలు జరగనున్నాయి. ఈ 16 డివిజన్లలో పోలింగ్ నిర్వహించేందుకు ఎన్నికల అధికారులు అన్ని రకాల ఏర్పాట్లను వేగవంతం చేస్తున్నారు. మేయర్ పీఠాన్ని కూడా దక్కించుకోవడమే లక్ష్యంగా కూటమి నేతలు వ్యూహాలు రచిస్తుండగా, మిగిలిన స్థానాల్లో తమ ఉనికిని చాటుకోవాలని ప్రత్యర్థి పార్టీలు ప్రయత్నిస్తున్నాయి.

ఇదినిజం
RNI Regd.No: APTEL/2012/45871
సాయంకాలం దినపత్రిక

# సంపాదకీయం

సోమవారం 26 అక్టోబర్ 2026

## మనువుపై అంత మనోవ్యథ ఎందుకు?

మనువు అనేవాడు అసలు ఉన్నాడా? ఉంటే ఏ కాలం వాడు? ఆయన రాజా? మంత్రా? లేక ఋషా? కల్పిత పాత్రా అంటూ వ్యాసకర్త అనుమానాన్ని వ్యక్తపరిచారు. మళ్లీ తానే ఆయన ఉన్నట్టుగా కొన్ని వర్గాలవారు ఆయన్ని తమ వాదంలోకి లాగి బలిపశువును చేస్తున్నారని అంగలార్చారు. వ్యాసకర్త మనువుని అభిమానిస్తున్నాడా? ఆయన్ని వ్యతిరేకించే వారిని అభిశంసిస్తున్నాడా? అనే విషయాలు పరస్పర విరుద్ధంగా ఉన్నాయి. ఎక్కడో పశ్చిమాసియా, తూర్పు యూరప్ దేశాల మధ్యలో పుట్టి, బతుకుదెరువు కోసం వచ్చిన వలసవాదులైన ఆర్యులు, అప్పటికే ఎంతో ఉన్నత స్థితిలో ఉండి, సుసంపన్నమైన నాగరికత కలిగిన హరప్ప, మొహంజదారో నగరాల పాలకులను దేహి అని భిక్షమడిగి నివాసాలు ఏర్పర్చుకున్నారు. ఇంత అద్భుతమైన అన్నపూర్ణ లాంటి ప్రాంతాన్ని ఎప్పటికీ వదిలి వెళ్లకూడదని నిశ్చయించుకున్నారు. శాశ్వతంగా తమ అస్తిత్వాన్ని ప్రబలంగా స్థాపించుకునేందుకు ఈ దేశ మూలవాసులను మొదలు తమ 'కర్మ, ధర్మ, పునర్జన్మ, వర్ణ శ్రమ భావజాల సిద్ధాంతం'తో లోబర్చుకొని మెల్లమెల్లగా వారిని తమ గుప్పిట్లోకి తీసుకున్నారు. వ్యతిరేకించిన కొంతమందిని ప్రత్యక్షంగా, మరి కొంతమందిని పరోక్షంగా హతమార్చారు. ఈ నీచుల వాదమే ఈ మనువు, మనుధర్మ శాస్త్రం.దుగ్గరాజు లేవనెత్తిన ప్రశ్నలో మనువు ఎక్కడివాడు? ఎప్పటివాడు అన్నదానికి కొంతమంది చరిత్రకారులు వ్యక్తపరిచిన అభిప్రాయం-- ఆయన క్రీ.పూ. 2వ శతాబ్దం నుంచి క్రీ.శ. 1వ శతాబ్దం మధ్యకాలంలో జన్మించి ఉండవచ్చు. ఆ ప్రకారం చూస్తే... ఆయన పుట్టిన కాలంలో బౌద్ధం ఉజ్జ్వలమైన స్థితిలో ఉంది. అప్పటి ఆర్య వర్గాల వారు సృష్టించిన వైదిక ధర్మం తుడిచిపెట్టుకుపోతున్న సందర్భంలో అది సహించలేని బుద్ధుడి వ్యతిరేకులు అదను చూసి రామాయణ, మహాభారత పురాణాలను సృష్టించారు. వీటితో పాటు నారద, పరాశర, యాజ్ఞవల్క్య వంటి అనేక ప్రతీఘాత స్మృతులను సృష్టించి, వాటిని అమలు చేయించిన మాయావాదులే మనువును కూడా సృష్టించారు. ఆ మనువు ఊహా చిత్రాన్ని రాజస్థాన్ హైకోర్టు ప్రాంగణంలో పెట్టించడానికి ప్రయత్నించిన మాయావాదుల సంగతి దుగ్గరాజుకు తెలియనట్టుంది. బుద్ధుడి కాలంలోనూ, ఆయన ప్రభావంతో రాజ్యాన్ని పరిపాలించిన సామ్రాట్ అశోక చక్రవర్తి కాలంలోనూ ఎక్కడా నిచ్చెన మెట్ల సమాజం ప్రస్తావన గానీ, కుల వివక్ష, అంటరానితనం అంశం గానీ లేదని... మరి అలాంటప్పుడు ఇప్పటి రాజకీయ నాయకులు ఆయన పేరుతో రాజకీయం చేయడం ఏమిటని తన ప్రశ్నగా కాకుండా, ఒక సామాన్యుడికి అనుమానం వచ్చినట్టుగా వ్యాసకర్త అడిగారు. అయితే ఎక్కడో పుట్టి ఈ దేశంలో బతకడానికి వచ్చిన ఆర్య, మనువాదుల మౌఖిక భాష అంటున్న సంస్కృతం, దాని మరో రూపమైన హిందీని... ద్రావిడ మూలాలు కలిగిన దక్షిణ భారతదేశ, ముఖ్యంగా తమిళనాడు ప్రజలు తమ సంస్కృతిని, సంప్రదాయాన్ని నాశనం చేసే ఆయుధమని ఇప్పటికీ 'హిందీ గో బ్యాక్' అనే ఉద్యమాన్ని సాగిస్తున్నారంటే... అది ఉత్తరం నుంచి దక్షిణానికి పాకినట్టు కాదా? అలాగే ఈ మనువాద భావజాల వాదులు శారీరక శ్రమ చేయకుండా కేవలం మాటలమ్ముకొని బతికే పరాన్నభుక్కులు. దక్షిణాదినా వారిని అనుసరిస్తున్నందుకే అది అన్ని ప్రాంతాలకూ పాకినట్టుగా అర్థం చేసుకోవాలి.ఇక మనుధర్మ శాస్త్రాన్ని ఎవరు రాయించారు? ఎందుకు రాయించారు? అలా రాసిన వారికే దానిని అమలు చేసే అధికారం ఎలా వస్తుందన్న ప్రశ్నలను వ్యాసకర్త లేవనెత్తారు. భారత రాజ్యాంగాన్ని రాయడానికి నియమించిన రాజ్యాంగ పరిషత్ కమిటీ... డా. బి.ఆర్.అంబేడ్కర్ నేతృత్వంలో రాజ్యాంగాన్ని రాసి, అప్పటి ప్రభుత్వానికి అందజేస్తే, దానిని పాలక వర్గాలు పాటించి, నడిపించాయి కదా? మరి మనువు తన స్మృతిని దేశమంతటా ఎలా పాకించగలిగాడు అన్న ప్రశ్నను లేవనెత్తడం విడ్డూరంగా లేదా?!ఎక్కడో యూరప్‌లో పుట్టిన ఆంగ్ల భాష ప్రపంచమంతా ఎలా పాకిందో వ్యాసకర్తకు తెలియదా? పాలకవర్గాలు తలచుకుంటే తాము కోరుకున్న రీతి చట్టాలను (స్మృతులను) రూపకల్పన చేయించి, అమలు చేయించలేరా? ఒకప్పటి మీసా, నాసా, ఇప్పటి ఉపా అర్బన్ నక్సలైట్ల నిర్మూలన వంటి చట్టాల వలే, ఈ మనుధర్మ శాస్త్రాన్ని అప్పటి రాజ్యాలు కాలక్రమంలో అంతటా విస్తరించి తమ ప్రభావాన్ని చూపెడుతూ కనీస మానవ హక్కులను కాలరాశాయి. అందుకే బుద్ధుడు, బసవేశ్వరుడు, పూలే, పెరియార్, నారాయణగురు, అంబేడ్కర్, కాన్షీరాం వంటి వారు పోరాడారు. ఈ మధ్య పుట్టిన కాక్రోచ్ జనతా పార్టీ కూడా అలాంటిదే. ఈ విషయాలను వ్యాసకర్త పరిగణనలోకి తీసుకుంటే బాగుండేది.దుగ్గరాజు వ్యాసాన్ని చదివిన వారికి మనువు ఉన్నాడో లేడో అనే డోలాయమాన స్థితి కలిగితే... శ్రీరాముడు, శ్రీకృష్ణుడి అస్తిత్వం ఏమవుతుందో? అలాగే బుద్ధుడి ప్రభావం చేత నాటి పురాతన వైదిక, మధ్యలో మారిన హైందవ, ఇప్పటి హిందూమతం అస్తిత్వం ఎలా ఉండేదో వ్యాసకర్త చెప్పి ఉంటే బాగుండేది. అప్పటి పాలకులైనా, ఇప్పటి పాలకులైనా (నయా సనాతన ధర్మకర్తలు) తమ రాజ్యాధికారాన్ని నిలుపుకోవడానికి ప్రయత్నిస్తున్నవారే. ఈ విషయాన్ని బుద్ధి జీవులందరూ గుర్తించి, జెన్‌జీలుగా అవతరిస్తూ జిల్ల పురుగులై దేశంలోనూ, ప్రపంచమంతా వ్యాపిస్తున్నారనే విషయాన్ని దుగ్గరాజు వంటి వ్యక్తులు గమనించవలసిన అవసరం ఎంతో ఉంది.

# కులవివక్ష కొనసాగిస్తూ హిందూ సమైక్యత సాధ్యమా?

### సామాజిక న్యాయం లేకుండా ఐక్యత నినాదాలకే పరిమితం.. కులాధిపత్యంపై ఆత్మపరిశీలన అవసరం!

కులాల పేరుతో మనుషులను విడదీస్తూ, మతాల పేరుతో ఇతరులను ద్వేషిస్తూ సమాజంలో ఐక్యతను ఎలా సాధించగలం? ఒకవైపు హిందూ సమాజమంతా ఒక్కటేనని నినదిస్తూ, మరోవైపు కులవివక్షను కొనసాగించడం ఎంతవరకు సమంజసం? చారిత్రకంగా వివక్షకు గురైన వర్గాలకు సామాజిక న్యాయం కల్పించే రిజర్వేషన్లను వ్యతిరేకిస్తూ సమైక్యత గురించి మాట్లాడటంలో ఔచిత్యమేమిటి? సామాజిక తత్వవేత్త, తెలంగాణ రాష్ట్ర తొలి బీసీ కమిషన్ చైర్మన్, శతాధిక గ్రంథకర్త బి.ఎస్. రాములు లేవనెత్తిన ఈ ప్రశ్నలు నేటి భారతీయ సమాజం ఆలోచించాల్సిన కీలక అంశాలుగా నిలుస్తున్నాయి.

**కులవ్యవస్థ.. సమైక్యతకు ప్రధాన సవాలు**

భారతదేశం భిన్న మతాలు, భాషలు, సంస్కృతులు, సంప్రదాయాలకు నిలయం. ఈ వైవిధ్యమే దేశానికి ప్రత్యేక గుర్తింపు. అయితే సమాజంలోని ప్రతి వ్యక్తికి సమాన గౌరవం, సమాన అవకాశాలు లభించినప్పుడే ఈ వైవిధ్యం నిజమైన ఐక్యతగా మారుతుంది. పుట్టుక ఆధారంగా మనిషి స్థాయిని నిర్ణయించడం, కులం పేరుతో సామాజిక సంబంధాలను పరిమితం చేయడం, అంటరానితనం పాటించడం, కులాంతర వివాహాలను వ్యతిరేకించడం వంటి పరిణామాలు సమానత్వానికి అడ్డంకులుగా కొనసాగుతున్నాయి. వర్ణవ్యవస్థ, కులవ్యవస్థల ప్రభావంతో భారతీయ సమాజంలో అనేక సామాజిక విభజనలు ఏర్పడ్డాయి. కొన్ని వర్గాలకు విద్య, భూమి, వృత్తులు, అధికార అవకాశాలు అందుబాటులో ఉండగా, మరికొన్ని వర్గాలు శతాబ్దాలపాటు వివక్షను ఎదుర్కొన్నాయి. ఈ చారిత్రక వాస్తవాలను విస్మరించి సమాజమంతా సమాన స్థితిలో ఉందని చెప్పడం వాస్తవ పరిస్థితులను విస్మరించడమే అవుతుంది.మనుస్మృతి వంటి ధర్మశాస్త్ర గ్రంథాల్లోని సామాజిక శ్రేణీకరణ భావనలను అనేక సంఘసంస్కర్తలు విమర్శించారు. అయితే కులవ్యవస్థ కొనసాగడానికి మతపరమైన వ్యాఖ్యానాలతోపాటు ఆర్థిక, రాజకీయ, సామాజిక కారణాలు కూడా దోహదపడ్డాయి. అందువల్ల కులవివక్షను నిర్మూలించాలంటే వివక్షను సమర్థించే ఆలోచనలతోపాటు వాటికి ఆధారంగా ఉన్న సామాజిక ఆచరణలను కూడా మార్చాలి.

**మతమార్పిడుల వెనుక సామాజిక వాస్తవాలు**

బి.ఎస్. రాములు ప్రస్తావించిన మరో ముఖ్యమైన అంశం మతమార్పిడులు. భారతదేశ చరిత్రలో వివిధ కాలాల్లో అనేక మతాలు విస్తరించాయి. మతమార్పిడులకు ఆధ్యాత్మిక విశ్వాసాలు, తాత్విక ఆకర్షణ, రాజకీయ పరిణామాలు, సామాజిక పరిస్థితులు వంటి భిన్న కారణాలు ఉన్నాయి. కొన్ని సందర్భాల్లో కులవివక్ష, అంటరానితనం, సామాజిక అవమానాల నుంచి విముక్తి పొందాలనే ఆకాంక్ష కూడా మతమార్పిడులకు ప్రేరణగా నిలిచింది.డాక్టర్ బి.ఆర్. అంబేడ్కర్ 1956లో బౌద్ధమతాన్ని స్వీకరించడం సామాజిక సమానత్వం, ఆత్మగౌరవం కోసం జరిగిన చారిత్రక ఉద్యమంలో కీలక ఘట్టం. కులవివక్షను ఎదుర్కొన్న అనేక మంది అంబేడ్కర్ మార్గాన్ని ఆత్మగౌరవానికి ప్రతీకగా భావించారు.అయితే ప్రతి మతమార్పిడికి కులవివక్ష ఒక్కటే కారణమని చెప్పలేం. అదే విధంగా బౌద్ధమతం భారతదేశంలో క్షీణించడానికి కూడా ఒకే కారణం లేదు. రాజకీయ మార్పులు, రాజపోషణలో తగ్గుదల, మతపరమైన పరిణామాలు, ప్రాంతీయ పరిస్థితులు తదితర అంశాలు ప్రభావం చూపాయి.అయినప్పటికీ, ఒక వ్యక్తి లేదా సమూహం వివక్షను ఎదుర్కొంటున్నప్పుడు ఆ పరిస్థితులను సరిదిద్దకుండా వారినే నిందించడం సమస్యను మరింత జటిలం చేస్తుంది. తమను గౌరవించని సమాజంలో కొనసాగాలని ఇతరులను బలవంతం చేయడం సాధ్యం కాదు. ప్రజలను కలిపి ఉంచాలంటే వారి ఆత్మగౌరవాన్ని కాపాడటం అత్యవసరం.

**ఇతర మతాలపై ద్వేషం కాదు.. మనలోని లోపాలపై దృష్టి పెట్టాలి**

హిందూ సమాజ ఐక్యతను కోరుకోవడం ఒక అభిప్రాయం. అయితే ఆ ఐక్యత సాధనలో కులవివక్షను నిర్లక్ష్యం చేయడం తీవ్రమైన వైరుధ్యం. ఇతర మతాల్లోని లోపాలను ఎత్తిచూపే ముందు తమ సమాజంలో కొనసాగుతున్న అంటరానితనం, కులాధిపత్యం, సామాజిక బహిష్కరణ వంటి సమస్యలను పరిష్కరించేందుకు ప్రాధాన్యం ఇవ్వాలి.మత విశ్వాసాలను గౌరవించడం అంటే అన్యాయాలను సమర్థించడం కాదు. ఏ మతంలోనైనా వివక్ష ఉంటే దాన్ని ప్రశ్నించాలి. అదే సమయంలో ఒక మతాన్ని అనుసరించే వారందరినీ ఒకే విధంగా చిత్రీకరించడం, వారి పట్ల ద్వేషాన్ని పెంచడం సామాజిక సామరస్యానికి విఘాతం కలిగిస్తుంది.ఇతర మతాలపై విమర్శలు చేయడం ద్వారా మాత్రమే హిందూ సమాజం బలపడదు. కులాల మధ్య సమానత్వం, పరస్పర గౌరవం, సామాజిక న్యాయం పెరిగినప్పుడే ఐక్యతకు బలమైన పునాది ఏర్పడుతుంది.

**కులాంతర వివాహాలతో సామాజిక గోడలు తొలగాలి**

కులవివక్ష నిర్మూలనకు కులాంతర వివాహాలు ఒక ముఖ్యమైన మార్గం. వివాహ సంబంధాలను కుల పరిధిలోనే పరిమితం చేయడం వల్ల తరతరాలుగా సామాజిక విభజనలు కొనసాగుతున్నాయి. కులాంతర వివాహాలను గౌరవించడం, అలాంటి జంటలకు కుటుంబాలు, సమాజం నుంచి మద్దతు లభించేలా చూడటం అవసరం. హిందూ సమైక్యత గురించి మాట్లాడే సంస్థలు కులాంతర వివాహాలను ప్రోత్సహించడం, అణగారిన వర్గాలపై వివక్షను నిరోధించడం, సమానత్వ భావనను తమ సంస్థాగత ఆచరణలో ప్రతిబింబించడం వంటి చర్యలకు ప్రాధాన్యం ఇవ్వాలి. రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్) సహా ఈ లక్ష్యాన్ని ప్రకటించే సంస్థలు తమ కార్యక్రమాల్లో కులవివక్ష నిర్మూలనకు ఎంత ప్రాధాన్యం ఇస్తున్నాయో సమీక్షించుకోవాల్సిన అవసరం ఉంది.అయితే కులాంతర వివాహాలు ఒక్కటే కులవ్యవస్థను పూర్తిగా తొలగించలేవు. విద్య, ఉపాధి, ఆర్థిక వనరులు, రాజకీయ ప్రాతినిధ్యం, సామాజిక గౌరవం వంటి రంగాల్లోనూ సమాన అవకాశాలు కల్పించాలి. అప్పుడే సామాజిక మార్పు విస్తృతంగా సాధ్యమవుతుంది.

**రిజర్వేషన్లను వ్యతిరేకిస్తూ సమైక్యత ఎలా సాధ్యం?**

రిజర్వేషన్లు భారత రాజ్యాంగం ద్వారా సామాజికంగా, విద్యాపరంగా వెనుకబడిన వర్గాలకు న్యాయం కల్పించేందుకు రూపొందించిన ముఖ్యమైన సాధనాలు. షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగలు, ఇతర వెనుకబడిన వర్గాలకు విద్య, ఉద్యోగాలు, రాజకీయ ప్రాతినిధ్యంలో అవకాశాలు కల్పించడం వాటి ప్రధాన లక్ష్యాల్లో భాగం.రిజర్వేషన్ల అమలు, ప్రయోజనాల పంపిణీ, విధానాల్లో మార్పులపై చర్చించవచ్చు. అయితే చారిత్రక వివక్షను విస్మరించి రిజర్వేషన్ల అవసరాన్నే ప్రశ్నించడం సామాజిక న్యాయ లక్ష్యానికి విరుద్ధంగా మారవచ్చు.బీసీలకు రిజర్వేషన్లు అవసరం లేదని ఒకవైపు వాదిస్తూ, మరోవైపు హిందూ సమాజమంతా ఒక్కటేనని చెప్పడం ఆలోచించాల్సిన వైరుధ్యం. సమాజంలోని వెనుకబడిన వర్గాలు తమ హక్కుల కోసం పోరాడుతున్నప్పుడు వారి సమస్యలను పరిష్కరించకుండా ఐక్యత గురించి మాట్లాడటం వల్ల ఆశించిన ఫలితం రాదు.సమైక్యత అంటే అందరూ తమ ప్రత్యేక సమస్యలను మరిచిపోయి ఒకే నినాదాన్ని అనుసరించడం కాదు. భిన్నమైన సామాజిక పరిస్థితులను గుర్తించి, అందరికీ న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవడం. సామాజిక న్యాయం, సమాన అవకాశాలు, పరస్పర గౌరవం ఉన్నప్పుడే ఐక్యత బలపడుతుంది.

**జనాభా సంఖ్యాబలం కంటే సామాజిక న్యాయం ముఖ్యం**

దేశంలో ఏ మతానికి ఎంత జనాభా ఉందన్నది ఒక అంశం. కానీ ఆ జనాభాలోని వివిధ సామాజిక వర్గాలకు విద్య, ఉపాధి, ఆర్థిక వనరులు, అధికారాల్లో ఎంత ప్రాతినిధ్యం లభిస్తోందన్నది అంతకంటే ముఖ్యమైన ప్రశ్న.బి.ఎస్. రాములు ప్రస్తావించిన వివిధ వర్గాల జనాభా శాతాలను అధికారిక గణాంకాలుగా స్వీకరించే ముందు వాటి మూలాలను పరిశీలించాలి. భారతదేశ 2011 జనగణన ప్రకారం హిందువులు 79.8 శాతం, ముస్లింలు 14.2 శాతం, క్రైస్తవులు 2.3 శాతం, సిక్కులు 1.7 శాతం, బౌద్ధులు 0.7 శాతంగా ఉన్నారు. ఇవి మతాల వారీ గణాంకాలు మాత్రమే; కులాల వారీ జనాభా లేదా సామాజిక వెనుకబాటుకు సంబంధించిన గణాంకాలు కావు.అందువల్ల సంఖ్యాబలాన్ని మాత్రమే ఆధారంగా చేసుకుని సామాజిక ఐక్యతను అంచనా వేయలేం. ఏ వర్గానికి ఎంత గౌరవం లభిస్తోంది? ఎవరు ఇంకా వివక్షను ఎదుర్కొంటున్నారు? వెనుకబడిన ప్రజలకు నాణ్యమైన విద్య, ఉపాధి, అభివృద్ధి అవకాశాలు అందుతున్నాయా? అనే ప్రశ్నలకు సమాధానాలు వెతకాలి.

**ఆచరణలో మార్పు వచ్చినప్పుడే నిజమైన ఐక్యత**

కులవివక్షను నిర్మూలించేందుకు రాజకీయ ప్రసంగాలు, మతపరమైన నినాదాలు మాత్రమే సరిపోవు. కుటుంబాలు, విద్యాసంస్థలు, కార్యాలయాలు, గ్రామాలు, పట్టణాలు అన్నిచోట్ల సమానత్వ భావన ఆచరణలో కనిపించాలి. అంటరానితనం, కులపరమైన అవమానాలు, సామాజిక బహిష్కరణను అరికట్టాలి. అణగారిన వర్గాలకు నాణ్యమైన విద్య, ఉపాధి, ఆర్థిక అవకాశాలు అందించాలి. కులాంతర వివాహాలను గౌరవించాలి. మతాల మధ్య విద్వేషం పెంచకుండా పరస్పర గౌరవాన్ని పెంపొందించాలి.సామాజిక తత్వవేత్త బి.ఎస్. రాములు లేవనెత్తిన ప్రశ్నల్లోని ప్రధాన సందేశం ఇదే: కులవివక్షను కొనసాగిస్తూ సమైక్యతను సాధించలేం. సామాజిక న్యాయాన్ని నిరాకరిస్తూ సమానత్వం గురించి మాట్లాడలేం.హిందూ సమాజ ఐక్యత కావాలన్నా, భారతదేశ ఐక్యత బలపడాలన్నా కులాధిపత్యం తగ్గాలి, అంటరానితనం అంతరించాలి, వెనుకబడిన వర్గాలకు సమాన అవకాశాలు లభించాలి. ఇతర మతాలపై ద్వేషం పెంచడం కంటే, మన సమాజంలోని అన్యాయాలను తొలగించడం నిర్మాణాత్మక మార్గం. మనిషిని కులం ఆధారంగా కాకుండా మనిషిగా గౌరవించినప్పుడే నిజమైన సమైక్యత సాధ్యమవుతుంది. ఐక్యత నినాదాల్లో కాదు.. సమానత్వాన్ని ఆచరించడంలో ఉంది.

# యుగంధర్ గూఢచర్యం - తరగని కుతూహలం

తెలుగు పఠన ప్రపంచంలో చెరగని సంతకంతో సుస్థిర స్థానాన్ని పొందిన రచయిత కొమ్మూరి సాంబశివరావు. ఆయన పేరు వినగానే '888', 'లక్షాధికారి హత్య', 'చీకటికి వెయ్యి కళ్లు' వంటి రచనలు మదిలో మెదులుతాయి. సాహిత్య చరిత్రలో కొందరు రచయితలు తాము రాసిన పుస్తకాలతో గుర్తుండిపోతారు. మరికొందరు తాము సృష్టించిన పాత్రలతో పాఠకుల హృదయాల్లో శాశ్వత నివాసం ఏర్పరచుకుంటారు. ఇంకొందరు పఠనమంటే ఏమిటో, కథ చెప్పడమంటే ఏమిటో, ఒక పుస్తకాన్ని చేతిలోకి తీసుకున్న పాఠకుడిని చివరి పుట వరకు ఎలా నడిపించాలో ఒక తరానికి నేర్పుతారు. కొమ్మూరి సాంబశివరావు మూడో కోవకు చెందిన విశిష్ట రచయిత. ఆయన పేరు వినగానే తెలుగు పాఠకుల మనస్సులో ఒక రహస్యం కదలాడుతుంది, ఒక అన్వేషణ మొదలవుతుంది, యుగంధర్ అనే డిటెక్టివ్ రూపం కళ్లముందు నిలుస్తుంది. అది ఒక రచయిత సాధించిన ప్రజాదరణ మాత్రమే కాదు, తెలుగు నవలా ప్రపంచంపై ఆయన వేసిన బలమైన ముద్రకు నిదర్శనం.ఒక రచయిత జన్మించి వందేళ్లు గడిచాయన్నది కాలగణనకు సంబంధించిన విషయం అయినా ఆ రచయిత సృష్టించిన ప్రపంచం ఇంకా పాఠకుల జ్ఞాపకాలలో జీవిస్తోందంటే, అది సాహిత్యానికి సంబంధించిన విషయం. 1926 అక్టోబరు 26న తెనాలిలో జన్మించిన కొమ్మూరి సాంబశివరావుకు సాహిత్య వాతావరణం కొత్తది కాదు. రచనా సంప్రదాయం, నాటకరంగ పరిచయం, పత్రికా ప్రపంచంతో అనుబంధం ఆయన వ్యక్తిత్వాన్ని తీర్చిదిద్దిన నేపథ్యాలు. తల్లి పద్మావతి రంగస్థలంతో అనుబంధం కలిగినవారు. కుటుంబంలోనే సాహిత్యాభిరుచి, కళల పట్ల ఆసక్తి ఉండటం ఆయన సృజనాత్మక ప్రయాణానికి అనుకూల వాతావరణాన్ని కల్పించింది.కొమ్మూరి తనకంటూ ఒక ప్రత్యేకమైన కథన పద్ధతిని రూపొందించుకున్నారు. పాఠకుడి ఆసక్తిని అంచనా వేయడం, కథలో ఉత్కంఠను పెంచడం, అనుమానాల మధ్య కొత్త ఆధారాలను ప్రవేశపెట్టడం, ఊహించని మలుపులతో కథను ముందుకు నడిపించడం-- ఇవన్నీ ఆయన రచనా శిల్పంలోని ప్రధాన లక్షణాలు. పద్నాలుగేళ్ల వయసు నుంచే రచన పట్ల ఆసక్తి పెంచుకున్న ఆయన, తరువాతి దశలో తెలుగు పాఠకులకు విస్తృతంగా చేరువయ్యారు. సినీ పాత్రికేయుడిగా, సంపాదకుడిగా పనిచేసిన అనుభవం ఆయన కథనంలో వేగాన్ని, దృశ్యాత్మకతను, సంభాషణల్లో సహజత్వాన్ని పెంపొందించింది.తెలుగులో అపరాధ పరిశోధన కథలకు పూర్వపు పరిచయాలు, అనువాద సంప్రదాయాలు ఉన్నా, ఆ ప్రక్రియను విస్తృత పాఠకలోకానికి చేరువ చేయడంలో కొమ్మూరి కీలక పాత్ర పోషించారు. తొలి తెలుగు డిటెక్టివ్ నవలా రచయితగా ఆయనకు గుర్తింపు ఉంది. ఆయన రచించిన '888' ఈ ప్రస్థానంలో ప్రాధాన్యం పొందిన నవల. డిటెక్టివ్ నవల అంటే కేవలం నేరం, నేరస్థుడు, పోలీసు విచారణల సమాహారం కాదు. అది మానవ ప్రవర్తనను పరిశీలించే ఒక పద్ధతి. కనిపించేది ఒకటి, వాస్తవం మరొకటి కావచ్చు. మనిషి చెప్పే మాటకు, అతని ప్రవర్తనకు మధ్య అంతరం ఉండవచ్చు. ఒక చిన్న ఆనవాలు పెద్ద రహస్యాన్ని విప్పవచ్చు. ఈ అంతరాలను పాఠకుడితో కలిసి అన్వేషించే సాహిత్య ప్రక్రియే డిటెక్టివ్ నవల. కొమ్మూరి ఈ ప్రక్రియలోని ఆసక్తిని తెలుగు పాఠకులకు అనుభూతిపరిచారు.కొమ్మూరి 1957--80ల మధ్య తన ప్రధాన రచనలను చేశారు. ప్రముఖ ఆంగ్ల రచయిత ఎడ్గార్ వాలెస్ ఆయనకి స్ఫూర్తి. కొమ్మూరి రచనలను మాజీ ప్రధానమంత్రి పి.వి.నరసింహారావు ఎంతగానో ఇష్టపడేవారు. ప్రముఖ తెలుగు రచయిత మల్లాది వెంకటకృష్ణమూర్తి కూడా కొమ్మూరి రచనల ద్వారా ప్రేరణ పొందారు.సాంబశివరావు సాంఘిక నవలలు కూడా రాసినా, ఆయనకు డిటెక్టివ్ నవలా రచయితగానే పేరు స్థిరపడిపోయింది. ఆయన మొత్తం మీద 70 డిటెక్టివ్ నవలలు రాశారు. ఇరవైకి పైగా సాంఘిక నవలలు రాశారు. ఆయన నవలలన్నీ కలిపి పది లక్షలకుపైగా కాపీలు అమ్ముడుపోయాయి. కొమ్మూరి సాంబశివరావు 1994 మే 17న కన్నుమూశారు. అయితే రచయిత జీవితం ముగిసినంత మాత్రాన ఆయన సాహిత్య జీవితం ముగిసిపోదు. తెలుగు నవలా చరిత్రలో ఆయన చేసిన కృషిని ఆధారాలతో నమోదు చేయాలి.

# నగర అభివృద్ధిలో ప్రజలూ భాగస్వామ్యులు కావాలి - డాక్టర్ సింధూర

**భవిష్యత్ తరాల అభ్యున్నతి టీడీపీతోనే సాధ్యం**

**11, 12 డివిజన్ల ఎన్నికల ప్రచారంలో డాక్టర్ సింధూర పొంగూరు**

**12వ డివిజన్ రోడ్ షోలో పాల్గొన్న మంత్రి నారాయణ**



నెల్లూరు (ఇదినిజం ప్రతినిధి ): గతంలో కన్నా మిన్నగా నెల్లూరు నగరం ఎంతగానో అభివృద్ధి చెందిందని, మరింత అభివృద్ధి తెలుగుదేశం ప్రభుత్వంతోనే సాధ్యమని, అందుకు ప్రజల భాగస్వామ్యం కూడా అవసరమని రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ కుమార్తె డాక్టర్ సింధూర పొంగూరు పిలుపునిచ్చారు.ఆదివారం నగరంలోని 11, 12వ డివిజన్ల ఎన్నికల ప్రచారంలో స్థానిక తెలుగుదేశం పార్టీ కూటమి అభ్యర్థులు కొండ గీతిక, కిన్నెర సాగర్‌తో కలిసి ఇంటింటి ప్రచారంలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా డాక్టర్ సింధూర మాట్లాడుతూ... నెల్లూరు నగర అభివృద్ధి కొనసాగేందుకు ప్రజలు సైతం భాగస్వాములు కావాలన్నారు. కూటమి ప్రభుత్వం బలపరిచిన టీడీపీ అభ్యర్థులు కిన్నెర గీతిక, కొండ సాగర్‌లను అలాగే మేయర్ అభ్యర్థిగా రూప్ కుమార్ యాదవ్‌ను మంచి మెజార్టీతో గెలిపించాలని కోరారు.విద్యార్థుల బంగారు భవిష్యత్తు కోసం పాఠశాలలను అభివృద్ధి చేశామని, పిల్లలు, పెద్దలు అందరి ఆరోగ్య అవసరాలను దృష్టిలో ఉంచుకుని నగరంలోని 30 పార్కులను ఆధునీకరించామని తెలిపారు.నారాయణ విద్యా సంస్థల ఆధ్వర్యంలో నిరుపేదలకు ఉచిత కంటి వైద్య పరీక్షలు, దంత వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి కంటి అద్దాలతో పాటు మందులు అందజేశామన్నారు.ఈ ప్రాంతంలో డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరచడమే కాకుండా, ఎండ్-టు-ఎండ్ రోడ్లు వేయించి పరిశుభ్రమైన వాతావరణాన్ని అందజేశామన్నారు. కేవలం రెండు సంవత్సరాల మూడు నెలల కాలంలో నెల్లూరు నగరం ఎంతో అభివృద్ధి చెందిందని, మరింత అభివృద్ధి కోసం నెల్లూరు మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. 12వ డివిజన్లో మంత్రి నారాయణ గారు రోడ్ షో కార్యక్రమంలో పాల్గొని ఇంటింటి ప్రచారం నిర్వహించి మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీని గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు.

# నెల్లూరు నగర అభివృద్ధి కొనసాగాలంటే కూటమి అభ్యర్థులను గెలిపించాలి..

**21వ డివిజన్ కార్పొరేటర్‌గా గునుకుల విజయలక్ష్మిని గెలిపించండి.. ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి.**



నెల్లూరు, ఆదివారం25:(ఇదినిజం ప్రతినిధి ):నెల్లూరు నగర అభివృద్ధిని మరింత ముందుకు తీసుకెళ్లేందుకు కూటమి అభ్యర్థులను గెలిపించాలని గౌరవ ఎంపీ శ్రీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి గారు ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఆదివారం ఉదయం స్థానిక చిల్డ్రన్స్ పార్క్‌లో పర్యటించిన ఆయన, అక్కడ వ్యాయామం కోసం వచ్చిన వాకర్స్‌ను కలిసి కూటమి అభ్యర్థులకు మద్దతు ఇవ్వాలని కోరారు. ఈ సందర్భంగా 21వ డివిజన్‌లో కూటమి బలపరిచిన జనసేన పార్టీ కార్పొరేటర్ అభ్యర్థి శ్రీమతి గునుకుల విజయలక్ష్మిని, 24వ డివిజన్‌లో కూటమి బలపరిచిన కార్పొరేటర్ అభ్యర్థి శ్రీమతి ఊటుకూరు చందు ప్రియను గెలిపించాలని ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి గారు వాకర్స్‌కు విజ్ఞప్తి చేశారు. అలాగే నెల్లూరు నగర మేయర్ అభ్యర్థి శ్రీ రూప్‌కుమార్ యాదవ్‌ను లక్ష ఓట్ల భారీ మెజారిటీతో గెలిపించి కూటమికి అండగా నిలవాలని కోరారు.ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొని అభ్యర్థుల విజయానికి ప్రజల మద్దతు కోరారు. ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ, వారి సమస్యల పరిష్కారానికి కృషి చేసే నాయకత్వానికి ప్రజలు పట్టం కట్టాలని వారు పేర్కొన్నారు.నెల్లూరు నగరాన్ని సుందరంగా తీర్చిదిద్దడంలో, మౌలిక సదుపాయాలను మెరుగుపరచడంలో రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి, నెల్లూరు నగర ఎమ్మెల్యే శ్రీ పొంగూరు నారాయణ గారి మార్గదర్శకత్వం కీలకమని నాయకులు తెలిపారు. కూటమి ప్రభుత్వ సమన్వయంతో నగరంలో అభివృద్ధి కార్యక్రమాలు మరింత వేగవంతం అవుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు.రాష్ట్ర అభివృద్ధి, ప్రజా సంక్షేమం లక్ష్యంగా ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారు, ఉప ముఖ్యమంత్రి శ్రీ పవన్ కళ్యాణ్ గారు నాయకత్వంలో కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతోందని పేర్కొంటూ, నెల్లూరు నగరంలో అభివృద్ధి ప్రస్థానం కొనసాగాలంటే కూటమి అభ్యర్థులను గెలిపించాలని ప్రజలకు పిలుపునిచ్చారు.

# కాలం మారినా.. చెరిగిపోని ఆప్యాయత!

**ఘంటసాల గానమాధుర్యంతో మొదలై.. అభిమానుల గుండెల్లో మధుర జ్ఞాపకంగా నిలిచిన పాటూరి శ్రీనివాసులు....**



నెల్లూరు (ఇదినిజం ప్రతినిధి ):కొన్ని పరిచయాలు కాలంతో పాటు మసకబారుతాయి.. మరికొన్ని పరిచయాలు కాలం గడిచేకొద్దీ మరింత మధురంగా మారుతాయి. అలాంటి అరుదైన ఆత్మీయతకు చిరునామా పాటూరి శ్రీనివాసులు. నాలుగు దశాబ్దాలకు పైగా ఘంటసాల గీతాలతో వేలాది కచేరీలు నిర్వహించి, 'అభినవ ఘంటసాల'గా గుర్తింపు పొందిన ఆయన జీవితం కేవలం గానప్రస్థానం కాదు.. తరతరాల జ్ఞాపకాలతో అల్లుకున్న అనుబంధాల ప్రయాణం! ఎస్ఎస్ఎల్సీ చదువుతున్న రోజుల నుంచే మొదలైన సంగీత ప్రస్థానం, ఎం.ఏ., బి.ఎడ్. విద్యార్హతలు సాధించి ప్రధానోపాధ్యాయుడిగా సేవలందించిన వృత్తి జీవితం.. ఈ రెండింటినీ సమన్వయం చేసుకుంటూ సాగిన ఆయన ప్రయాణం ఎంతో ప్రత్యేకం. జమున, నాగేశ్వరరావు వంటి ప్రముఖులతో బెంగళూరులో, అంజలీదేవితో కోటలో జరిగిన సన్మానాలు ఆయన కళాజీవితంలో మధురమైన ఘట్టాలు. అయినా ఆయనకు లభించిన అత్యంత విలువైన గౌరవం మాత్రం అభిమానుల హృదయాల్లోనే ఉంది.నెల్లూరులోని మట్టికి సెంటర్.. ఆయన ఆత్మీయతకు చిరునామా! అక్కడి టీ బంకుల వద్ద ఆయన కోసం ఎదురుచూసే పాత మిత్రులు, అభిమానులు ఇప్పటికీ కనిపిస్తారు. ఆటోలో వచ్చి దిగగానే ఆప్యాయంగా చేయి పట్టుకుని పలకరించడం.. అందరూ కలిసి టీ తాగుతూ పాత రోజుల్ని గుర్తుచేసుకోవడం.. అప్పటి కచేరీల గురించి, పరిచయాల గురించి నవ్వుకుంటూ ముచ్చటించుకోవడం.. ఈ దృశ్యాల్లోనే అసలైన జీవిత మాధుర్యం దాగుంది. దశాబ్దాలు గడిచినా ఒక మనిషి రాక కోసం ఎదురుచూసే స్నేహితులు ఉండటం ఎంతటి అదృష్టమో కదా!వయసు మీదపడినా ఆయనలోని చిరునవ్వు మారలేదు.. పలకరింపుల్లోని ఆప్యాయత తగ్గలేదు. ఒకప్పుడు ఆయన పాటలు విని ఆనందించినవారు, నేడు ఆయనతో కాసేపు మాట్లాడితే చాలని భావిస్తున్నారు. నిన్నటి జ్ఞాపకాలను నేటి పలకరింపులతో ముడిపెడుతూ సాగుతున్న ఈ అనుబంధం, వయసు పైబడిన ప్రతి మనసుకూ తన పాత రోజులను గుర్తుచేసే అందమైన అనుభూతి.ఆర్భాటం లేని జీవితం.. ప్రచారం కోరని వ్యక్తిత్వం.. అయినా చెరిగిపోని ప్రజాభిమానం! పాటూరి శ్రీనివాసులు సాధించిన గొప్పతనం ఇదే. ఘంటసాల గీతాలు ఆయనకు బిరుదును తెచ్చిపెడితే.. దశాబ్దాల స్నేహం, ఆత్మీయ పలకరింపులు ఆయనకు జీవితకాల గౌరవాన్ని అందించాయి.కాలం మారుతుంది.. తరాలు మారుతాయి.. కానీ కలిసి గడిపిన క్షణాలు, టీ బంకుల వద్ద పంచుకున్న ముచ్చట్లు, ఆప్యాయంగా పట్టుకున్న చేతులు, చిరునవ్వుతో పలకరించిన మనుషులు మాత్రం జ్ఞాపకాల గుండెల్లో పదిలంగా ఉంటారు. పాటూరి శ్రీనివాసులు గానంతో అలరించిన కళాకారుడే కాదు.. మనుషుల ప్రేమను సంపాదించుకున్న మధురమైన వ్యక్తిత్వం కూడా!కొన్ని పాటలు చెవుల్లో మార్మోగుతాయి.. కొన్ని జ్ఞాపకాలు గుండెల్లో నిలిచిపోతాయి. పాటూరి శ్రీనివాసులు మాత్రం తన గానంతోనూ, ఆప్యాయతతోనూ రెండింటిలోనూ చెరగని ముద్ర వేసుకున్నారు!

# కోవూరులో వైసీపీ నుంచి టీడీపీలోకి భారీగా చేరికలు...

**ఇందుకూరుపేట మండలం మైపాడు పంచాయతీ పడమటిపాళెం నుంచి మాజీ ఎంపీటీసీ కునింగారి రమణయ్య ఆధ్వర్యంలో 100 మందికిపైగా చేరిక**



నెల్లూరు (ఇదినిజం ప్రతినిధి ): కోవూరు నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీకి చెందిన కీలక నాయకులు, కార్యకర్తలు ఆదివారం తెలుగుదేశం పార్టీలో చేరారు. నెల్లూరులోని కోవూరు శాసనసభ్యులు శ్రీమతి వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి స్వగృహంలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే వారందరికీ పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. బుచ్చిరెడ్డిపాళెం మండలం నాగాయగుంట పంచాయతీకి చెందిన వైసీపీ నేత, మునులపూడి ఎంపీటీసీ అభ్యర్థి శ్రీ చంద్రగిరి ప్రభాకర్ గారు తెలుగుదేశం పార్టీలో చేరడంతో పాటు, తాను దాఖలు చేసిన నామినేషన్‌ను ఉపసంహరించుకోవాలని నిర్ణయించుకున్నారు. ఆయనతో పాటు నాయకులు శ్రీ చంద్రగిరి రాంబాబు, శ్రీ అశోక్, శ్రీ బత్తల రమేష్ తదితరుల ఆధ్వర్యంలో 30కి పైగా కుటుంబాలు టీడీపీలో చేరాయి. అలాగే, ఇందుకూరుపేట మండలం మైపాడు పంచాయతీ పడమటిపాళెంకు చెందిన వైసీపీ మాజీ ఎంపీటీసీ శ్రీ కునింగారి రమణయ్య గారి ఆధ్వర్యంలో 100 మందికిపైగా తెలుగుదేశం పార్టీలో చేరారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీమతి వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి గారు మాట్లాడుతూ, స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి అభ్యర్థుల విజయానికి ప్రతి ఒక్కరూ సమన్వయంతో పనిచేయాలని, కూటమి అభ్యర్థులను గెలిపించేందుకు కృషి చేయాలని కోరారు.

# ఎన్-3 ఛానల్ ఎండీని కలిసిన స్వతంత్ర అభ్యర్థి జయశ్రీ



నెల్లూరు(ఇదినిజం ప్రతినిధి ): నెల్లూరు నగర మేయర్ స్వతంత్ర అభ్యర్థి, విద్యావంతురాలు ఎన్. జయశ్రీ ఎన్నికల ప్రచారంలో దూసుకుపోతున్నారు. ఆదివారం ప్రచారంలో భాగంగా నగరంలోని అన్నమయ్య సర్కిల్ సెంటర్లో ఉన్న ఎన్-3 టీవీ ఛానల్, నెల్లూరు న్యూస్ నెట్ వర్క్ కార్యాలయాన్ని ఆమె సందర్శించారు.ఛానల్ యజమాని, ఎండీ సునీల్ ని, కార్యాలయ సిబ్బందిని మర్యాదపూర్వకంగా కలిసి తనకు మద్దతు ఇవ్వాలని కోరారు. నవంబర్ 1న జరిగే పోలింగ్‌లో తనకు కేటాయించిన బీరువా' గుర్తుపై తమ అమూల్యమైన ఓటు వేసి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు.నగర అభివృద్ధి, మహిళా సాధికారతే తన ప్రధాన లక్ష్యమని ఈ సందర్భంగా ఆమె తెలిపారు.

# దామరమడుగులో ఎంపీటీసీ అభ్యర్థులుగా సిపిఎం పార్టీ పోటీ....



నెల్లూరు (ఇదినిజం ప్రతినిధి ): దామరమడుగులో సిపిఎం పార్టీ అభ్యర్థులుగా ఒకటవ సెగ్మెంట్ నుండి గరికపాటి సురేష్, రెండవ సెగ్మెంట్ నుండి వంజీవాక సరిత లు ఎంపీటీసీలుగా పోటీలో ఉంటారని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి మూలం రమేష్ ప్రకటించారు. ఆదివారం బుచ్చిరెడ్డిపాలెం సిపిఎం పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సిపిఎం పార్టీ అభ్యర్థులు పేద ప్రజల పక్షపాతి పోరాటయోధుడు కామ్రేడ్ జక్కా వెంకయ్య ఆదర్శాలను ముందుకు తీసుకెళ్లేందుకు ఇక్కడ ఉన్న రెండు ఎంపీటీసీ స్థానాల నుండి పార్టీ అభ్యర్థులను నిలబెడుతున్నామని తెలిపారు. ఇక్కడ నుండి గెలుపొందిన వీరు మండలంలోని ప్రజా సమస్యలపై పోరాడుతారని తెలిపారు. వీరిని రాబోయే మండల పరిషత్ ఎన్నికల్లో సుత్తి కొడవలి నక్షత్రం గుర్తుపై మీ అమూల్యమైన ఓటు వేసి గెలిపించి గా కోరారు.శ ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ జిల్లా కమిటీ నాయకులు జొన్నలగడ్డ వెంకమ రాజు, మంగళం పుల్లయ్య, తిరకాలి దయాకర్ మండల నాయకులు గండవరపు శ్రీనివాసులు, చల్లకొలుసు మల్లికార్జున, పుత్తేటి మల్లికార్జున, మద్దిశెట్టి సురేష్, తంబి రమణయ్య, గండవరం మల్లికార్జున నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

ఇదినిజం
RNI Regd.No: APTEL/2012/45871
సాయంకాలం దినపత్రిక



# కాకాణి గోవర్ధన్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసిన వైయస్ ఆర్ కాంగ్రెస్ పార్టీ మున్సిపల్ చైర్మన్ అభ్యర్థి తంబిరెడ్డి రాజేశ్వరమ్మ :



సూళ్లూరుపేట డివిజన్ ఇన్చార్జి నాయుడుపేట అర్బన్ ఇది నిజం ప్రతినిధి. : తిరుపతి జిల్లా సూళ్లూరుపేట నియోజకవర్గం నాయుడుపేట పట్టణములో ఈరోజు జరిగిన కార్యక్రమంలో ఉమ్మడి నెల్లూరు జిల్లా వైయస్ ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, మాజీ మంత్రి శ్రీ కాకాణి గోవర్ధన్ రెడ్డి గారు నాయుడుపేటలోని తంబిరెడ్డి జనార్ధన్ రెడ్డి గారి నివాసానికి విచ్చేశారు.ఈ సందర్భంగా వైయస్ ఆర్ కాంగ్రెస్ పార్టీ బలపరిచిన నాయుడుపేట మున్సిపల్ చైర్మన్ అభ్యర్థి శ్రీమతి తంబిరెడ్డి రాజేశ్వరమ్మ గారు,టి యం ఆర్ గ్రూప్ అధినేత తంబిరెడ్డి మోహన్ రెడ్డి గారు, వారి కుటుంబ సభ్యులు కాకాణి గోవర్ధన్ రెడ్డి గారికి ఘనస్వాగతం పలికి శాలువాలతో సత్కరించారు.అనంతరం తంబిరెడ్డి జనార్ధన్ రెడ్డి గారు, రాజేశ్వరమ్మ గారితో కాకాణి గోవర్ధన్ రెడ్డి గారు కొద్దిసేపు ఆత్మీయంగా ముచ్చటించారు. ఈ సందర్భంగా రానున్న మున్సిపల్ ఎన్నికల ప్రచారం, పార్టీ విజయావకాశాలు, ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాలపై చర్చించారు. నాయుడుపేట మున్సిపాలిటీలో వైఎస్సార్‌సీపీ బలపరిచిన చైర్మన్ అభ్యర్థి రాజేశ్వరమ్మ గారితో పాటు కౌన్సిలర్ అభ్యర్థులు కూడా మంచి మెజారిటీతో విజయం సాధించేలా ఆశీస్సులు అందించాలని కోరారు.అనంతరం నాయకులందరూ కలిసి భోజనం చేసి, మరికొంతసేపు ఆత్మీయంగా మాట్లాడుకున్నారు.ఈ కార్యక్రమంలో సూళ్లూరుపేట నియోజకవర్గ పరిశీలకులు భిరదవోలు శ్రీకాంత్ రెడ్డి గారు, సూళ్లూరుపేట మాజీ ఎమ్మెల్యే శ్రీ కిలివేటి సంజీవయ్య గారు చదలవాడ కుమార్ గారు తదితరులు పాల్గొన్నారు.

# జైలు నుంచే వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ పట్ల నిబద్ధతను, వైఎస్ కుటుంబం పట్ల అభిమానాన్ని చాటుకున్న ఎన్ డిసిసి బ్యాంక్ మాజీ చైర్మన్ కామిరెడ్డి సత్యనారాయణ రెడ్డి




సూళ్లూరుపేట డివిజన్ ఇన్చార్జి పెళ్లకూరు మండలం ఇది నిజం ప్రతినిధి. : తిరుపతి జిల్లా సూళ్లూరుపేట నియోజకవర్గం పెళ్లకూరు మండల జెడ్పీటీసీ నామినేషన్లపై కాకాని గోవర్ధన్ రెడ్డి గారి వివరణ ఇవ్వడం జరిగింది.ఈరోజు కామిరెడ్డి సత్యనారాయణ రెడ్డి గారు జైలు నుంచే నామినేషన్ దాఖలు చేయడానికి ముందుకు రావడాన్ని నిజంగా అభినందిస్తున్నాను. ఇది పార్టీ పట్ల ఆయనకున్న నిబద్ధతను, వైఎస్ కుటుంబం పట్ల ఆయనకున్న అభిమానాన్ని చాటిచెబుతోంది.ఎలాంటి తప్పు చేయకుండానే కామిరెడ్డి సత్యనారాయణ రెడ్డి గారిని రెండోసారి అక్రమంగా జైలులో పెట్టారని కాకాని గోవర్ధన్ రెడ్డి ఆరోపించారు. జైలులో ఉండి నామినేషన్ దాఖలు చేసేందుకు జైలు సూపరింటెండెంట్ ధ్రువీకరణ, సంతకం అవసరమైన నేపథ్యంలో, సంబంధిత హైకోర్టుల తీర్పులను సమర్పించిన తర్వాత నామినేషన్ పత్రాలపై ధ్రువీకరణ పొందినట్లు వివరించారు.అదేవిధంగా, కామిరెడ్డి ప్రభావతమ్మ గారు కూడా పెల్లకూరు మండల జెడ్పీటీసీ ఎన్నికలకు సంబంధించి నామినేషన్ దాఖలు చేసినట్లు ప్రెస్ మీట్‌లో వెల్లడించారు.

# సత్యవేడు సర్పంచ్ బరిలో కె.కుబేంద్రన్ తనయుడు అడ్వకేట్ కె. కుబేరన్ పోటీ

### ప్రజల మద్దతు కోరుతూ ఎన్నికల బరిలోకీ.



సూళ్లూరుపేట డివిజన్ ఇన్చార్జి సత్య వేడు మండలం ఇది నిజం ప్రతినిధి. :తిరుపతి జిల్లా సత్యవేడు గ్రామ సర్పంచ్ పదవికి కె.కుబేంద్రన్ తనయుడు, అడ్వకేట్ కె.కుబేరన్ దీ.నా.షె.నా.దీ. నిలబడుతున్నారు. సర్పంచ్ అభ్యర్థిగా ప్రజల ముందుకు వస్తూ,వారి మద్దతు కోరుతున్నారు.విద్యావంతుడైన న్యాయవాదిగా తనకున్న అనుభవంతో గ్రామ ప్రజలకు సేవ చేయాలనే లక్ష్యంతో ఆయన సర్పంచ్ ఎన్నికల బరిలో నిలుస్తున్నారు. గ్రామ అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారం, మౌలిక సదుపాయాల మెరుగుదల వంటి అంశాలకు ప్రాధాన్యతనిస్తూ ప్రజల ఆదరాభిమానాలు పొందేందుకు ముందుకు సాగుతున్నారు. సత్యవేడు గ్రామంలో సర్పంచ్ ఎన్నికల నేపథ్యంలో కుబేంద్రన్ తనయుడు అడ్వకేట్ కె. కుబేరన్ పోటీకి దిగడం స్థానికంగా ఆసక్తికరంగా మారింది. ప్రజల ఆశీస్సులు, మద్దతుతో గ్రామ అభివృద్ధికి కృషి చేయాలనే సంకల్పంతో ఆయన ప్రజలను మద్దతు కోరుతున్నారు.

# నాయుడుపేట పట్టణములో 27, 29, 30, 31వ వార్డుల్లో తంబిరెడ్డి రాజేశ్వరమ్మ గారి విస్తృత ఎన్నికల ప్రచారం

### ప్రచారంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య గారు -- ప్రజల నుంచి విశేష స్పందన




సూళ్లూరుపేట డివిజన్ ఇన్చార్జి నాయుడుపేట అర్బన్ ఇది నిజం ప్రతినిధి. :తిరుపతి జిల్లా సూళ్లూరుపేట నియోజకవర్గం నాయుడుపేట మున్సిపాలిటీ పరిధిలోని 27, 29, 30, 31వ వార్డుల్లో వైయస్ ఆర్ కాంగ్రెస్ పార్టీ బలపరిచిన మున్సిపల్ చైర్‌పర్సన్ అభ్యర్థి తంబిరెడ్డి రాజేశ్వరమ్మ గారు విస్తృతంగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు.ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య గారు ప్రచారంలో పాల్గొని ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతూ, గతంలో వైయస్ ఆర్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ హయాంలో ప్రజల సంక్షేమం, పట్టణ అభివృద్ధికి పెద్దపీట వేశామని గుర్తుచేశారు. రాబోయే రోజుల్లో నాయుడుపేట మున్సిపాలిటీలోని ప్రతి వార్డులో రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థ, మురుగునీటి కాలువలు, పారిశుధ్యం వంటి మౌలిక సమస్యలకు ప్రాధాన్యతనిస్తూ అభివృద్ధి పనులు చేపట్టేందుకు కృషి చేస్తామని తెలిపారు. ప్రజల సమస్యల పరిష్కారానికి ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటామని భరోసా ఇచ్చారు.తంబిరెడ్డి రాజేశ్వరమ్మ గారు ప్రతి గడపను పలకరిస్తూ, ప్రతి కుటుంబాన్ని ఆప్యాయంగా కలుస్తూ ప్రజల సమస్యలను స్వయంగా అడిగి తెలుసుకున్నారు. ప్రజలకు సేవ చేయాలనే సంకల్పంతో మీ ముందుకు వచ్చామని, ప్రతి సమస్యను మా సమస్యగా భావించి పరిష్కారం కోసం నిరంతరం కృషి చేస్తామని స్పష్టం చేశారు.ఈ ప్రచార కార్యక్రమంలో నాయుడుపేట టౌన్ ప్రెసిడెంట్ కలికి మాధవరెడ్డి గారు, జిల్లా కార్యదర్శి కామిరెడ్డి రాజారెడ్డి గారు, ఒట్టూరు కిషోర్ యాదవ్ గారు తదితర వైయస్ ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.ప్రచారానికి స్థానిక ప్రజల నుంచి విశేష స్పందన లభించింది.ప్రజల సమస్యలే మా ప్రాధాన్యత వార్డుల అభివృద్ధే మా లక్ష్యం,ప్రజల ఆశీస్సులతో అభివృద్ధి దిశగా నాయుడుపేట పట్టణంలో రాజేశ్వరమ్మ ముందుకు సాగుతున్నారు.

# చిట్టమూరు మండల వైయస్ ఆర్ కాంగ్రెస్ పార్టీ కన్వీనర్ అక్రమ అరెస్టును ఖండించిన ఎంపీ గురుమూర్తి

### ప్రజాస్వామ్య హక్కులను కాలరాస్తూ ప్రతిపక్ష నేతలను అక్రమ అరెస్టులతో భయపెట్టడం దుర్మార్గం. :
### అక్రమ అరెస్టుపై రాష్ట్ర ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేయనున్న ఎంపీ. :



సూళ్లూరుపేట డివిజన్ ఇన్చార్జి చిట్టమూరు మండలం ఇది నిజం ప్రతినిధి. : గూడూరు నియోజకవర్గం చిట్టమూరు మండల వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కన్వీనర్ శ్రీనివాసరెడ్డి అక్రమ అరెస్టును తిరుపతి ఎంపీ డాక్టర్ మద్దిల గురుమూర్తి తీవ్రంగా ఖండించారు. ప్రతిపక్ష నాయకులు, కార్యకర్తలను లక్ష్యంగా చేసుకుని అరెస్టులు చేయడం ద్వారా కూటమి ప్రభుత్వం ప్రజాస్వామ్య హక్కులను కాలరాస్తోందని ఆయన విమర్శించారు.ప్రజాస్వామ్యంలో ప్రతి పౌరుడికి తన అభిప్రాయాన్ని వ్యక్తం చేసే హక్కుతో పాటు రాజకీయ కార్యకలాపాల్లో పాల్గొనే స్వేచ్ఛ ఉందని గురుమూర్తి స్పష్టం చేశారు. ప్రతిపక్ష నాయకులపై పోలీసు వ్యవస్థను ప్రయోగించి వారిని భయభ్రాంతులకు గురిచేయడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని పేర్కొన్నారు. నామినేషన్ కేంద్రాల వద్ద గుంపులు గుంపులుగా ఉన్న కూటమి కార్యకర్తలను నిలువరించలేని పోలీసులు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులపై కేసులు పెట్టి వేధించడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ అక్రమ అరెస్టుపై ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేయనున్నట్లు ఎంపీ వెల్లడించారు.స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో వైయస్ ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలను అడ్డుకోవడం, అరెస్టులతో ఒత్తిడికి గురిచేయడం వంటి చర్యలు స్వేచ్ఛాయుతమైన ఎన్నికల నిర్వహణపై అనుమానాలు కలిగిస్తున్నాయని అన్నారు. ఎన్నికల్లో ప్రజలు తమకు నచ్చిన అభ్యర్థులను స్వేచ్ఛగా ఎన్నుకునే వాతావరణాన్ని కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంతో పాటు పోలీసు యంత్రాంగంపై ఉందని గుర్తుచేశారు.అధికార పార్టీ ఒత్తిళ్లకు తలొగ్గకుండా పోలీసులు చట్టప్రకారం, నిష్పక్షపాతంగా వ్యవహరించాలని ఎంపీ కోరారు. చిట్టమూరు మండల వైయస్ ఆర్ కాంగ్రెస్ పార్టీ కన్వీనర్ అరెస్టుకు సంబంధించిన పరిస్థితులపై సమగ్ర విచారణ జరిపి, చట్టవిరుద్ధంగా వ్యవహరించినట్లు తేలితే బాధ్యులపై తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రతిపక్ష గొంతుకను అణచివేయాలనే ప్రయత్నాలు ప్రజాస్వామ్యంలో ఎన్నటికీ ఫలించవని, వైయస్ ఆర్ కాంగ్రెస్ పార్టీ ప్రజల పక్షాన నిలబడి వారి హక్కుల పరిరక్షణ కోసం నిరంతరం పోరాడుతుందని డాక్టర్ మద్దిల గురుమూర్తి స్పష్టం చేశారు.

# లక్ష మెజారిటీ టార్గెట్-నారాయణ త్రిశూల వ్యూహం.

### నెల్లూరు మేయర్ పీఠమే లక్ష్యంగా కూటమి దూకుడు.
### ప్రత్యర్థుల డిపాజిట్ల గల్లంతే లక్ష్యం
### రూప్ కుమార్ యాదవ్ గెలుపు కోసం ప్రత్యేక కార్యాచరణ.
### డివిజన్ల వారీగా ప్రచారానికి పదును పెడుతున్న నారాయణ



నెల్లూరు:అక్టోబర్ 25.(ఇదినిజం ప్రతినిధి ):నెల్లూరు నగరపాలక సంస్థలో మేయర్ పీఠాన్ని భారీ మెజారిటీతో కైవసం చేసుకోవడమే లక్ష్యంగా మంత్రి పొంగూరు నారాయణ పక్కా వ్యూహంతో ముందుకు సాగుతున్నారు.లక్షకు పైగా మెజారిటీని లక్ష్యంగా నిర్దేశించుకుని, కూటమి అభ్యర్థుల విజయంతో పాటు ప్రత్యర్థి పార్టీలకు గట్టి షాక్ ఇవ్వాలనే పట్టుదలతో ప్రచారాన్ని పరుగులు పెట్టిస్తున్నారు.మేయర్ అభ్యర్థి రూప్ కుమార్ యాదవ్ గెలుపును ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న మంత్రి తన సొంత ఎన్నికను తలపించే స్థాయిలో ప్రచార బాధ్యతలను భుజాన వేసుకున్నారు.ఒకవైపు కుటుంబ సభ్యులతో రోడ్‌షోలు, ఇంటింటి ప్రచారాలు నిర్వహిస్తూనే,మరోవైపు రోజుకు 15 డివిజన్లలో ఆత్మీయ సమావేశాలు, కమ్యూనిటీ మీటింగ్ లు,ముఖ్య నేతలతో భేటీలతో బిజీగా గడుపుతున్నారు. డివిజన్ల వారీగా రాజకీయ పరిస్థితులు, అభ్యర్థుల బలాబలాలు,ఓటర్ల స్పందనపై ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేస్తున్నారు. ప్రచారంలో ఎక్కడా అలసత్వానికి తావులేకుండా క్షేత్రస్థాయిలో పార్టీ యంత్రాంగాన్ని అప్రమత్తం చేస్తున్నారు.

**మూడు దారుల్లో వ్యూహాత్మక దూకుడు**

ఎన్నికల ప్రచారాన్ని మూడు ప్రధాన కోణాల్లో మంత్రి ముందుకు తీసుకెళ్తున్నారు.కుటుంబ సభ్యులతో ప్రజల్లోకి వెళ్లి ఓటర్లను నేరుగా కలవడం,డివిజన్ల వారీగా నేతలు, కార్యకర్తలను సమన్వయం చేస్తూ ప్రచారాన్ని ఉధృతం చేయడం. మేయర్ అభ్యర్థి రూప్ కుమార్ యాదవ్‌తో పాటు జనసేన, బీజేపీ అభ్యర్థుల విజయానికి అవసరమైన రాజకీయ సమీకరణాలను బలోపేతం చేయడం.ఈ త్రిముఖ కార్యాచరణతో నగరంలో కూటమి ప్రచారానికి మరింత ఊపు తీసుకొచ్చే ప్రయత్నం చేస్తున్నారు.

**రూరల్‌లోనూ అదే జోరు**

నెల్లూరు రూరల్ నియోజకవర్గంలోనూ కూటమి ప్రచారం వేగం పెంచుకుంది. ఎమ్మెల్యే కుటుంబ సభ్యులు,ఎంపీ,మేయర్ అభ్యర్థి వేర్వేరుగా ప్రచార కార్యక్రమాలతో ప్రజల్లోకి వెళ్తున్నారు. డివిజన్ల వారీగా ఓటర్లను కలుస్తూ కూటమి అభ్యర్థులకు మద్దతు కూడగట్టే ప్రయత్నాలు చేస్తున్నారు.

**క్యాడర్‌కు నిరంతర దిశానిర్దేశం**

ఎన్నికల్లో కేవలం ప్రచార హడావుడే కాకుండా, ప్రతి డివిజన్‌లో సమర్థమైన క్షేత్రస్థాయి యంత్రాంగం పనిచేయాలన్నది మంత్రి లక్ష్యంగా కనిపిస్తోంది. ముఖ్య నేతలతో సమీక్షలు, కార్యకర్తలతో సమావేశాలు, అభ్యర్థులతో సమన్వయం ద్వారా ప్రచారాన్ని నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. జనసేన, బీజేపీ అభ్యర్థుల విజయానికి కూడా ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తూ కూటమి ఐక్యతను క్షేత్రస్థాయిలో బలోపేతం చేస్తున్నారు. మరోవైపు సమన్వయపూర్వక ప్రచారంతో వైఎస్ఆర్సీపీపై ఒత్తిడి పెంచుతున్నారు.లక్ష మెజారిటీ లక్ష్యంగా మంత్రి నారాయణ వేస్తున్న అడుగులు, డివిజన్ల వారీగా సాగుతున్న ప్రచారం, మేయర్ అభ్యర్థి గెలుపుపై పెడుతున్న ప్రత్యేక దృష్టి.. నెల్లూరు నగర రాజకీయాల్లో ఎన్నికల వేడిని మరింత పెంచుతున్నాయి.

RNI Regd.No: APTEL/2012/45871
ఇదినిజం
సాయంకాలం దినపత్రిక


# చెప్పాం.. చేస్తున్నాం.. గ్రామాల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉంది: ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి

## స్వతంత్ర అభ్యర్థిగా వేసిన నామినేషన్‌ను ఉపసంహరించుకునేందుకు అంగీకరించిన టీడీపీ నేత పెంచల ప్రసాద్

నెల్లూరు (ఇదినిజం ప్రతినిధి ): కోవూరు శాసనసభ్యులు శ్రీమతి వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి గారు ఆదివారం ఉదయం బుచ్చిరెడ్డిపాళెం రూరల్‌లోని రేబాల--2, దామరమడుగు--1, దామరమడుగు--2, కాలయకాగళ్లు, పెనుబల్లి, జొన్నవాడ గ్రామ పంచాయతీల్లో 'చెప్పాం.. చేస్తున్నాం' ఇంటింటి ప్రచారం నిర్వహించారు. బుచ్చిరెడ్డిపాళెం జడ్పీటీసీ కూటమి అభ్యర్థి శ్రీ ఏటూరు శివరామకృష్ణారెడ్డి గారితో పాటు ఎంపీటీసీ కూటమి అభ్యర్థులు శ్రీ గోరు రామిరెడ్డి గారు (రేబాల--2), శ్రీమతి దార అన్నపూర్ణ గారు (దామరమడుగు--1), శ్రీమతి మన్నెం సునీత గారు (దామరమడుగు--2), శ్రీమతి పేరం జానకమ్మ గారు (కాలయకాగళ్లు), శ్రీ సన్నపురెడ్డి లక్ష్మయ్య (పెనుబల్లి), శ్రీమతి బూదూరు అరుణ (జొన్నవాడ)లను సైకిల్ గుర్తుపై రెండు ఓట్లు వేసి భారీ మెజారిటీతో గెలిపించాలని ఆమె కోరారు.సూపర్ సిక్స్ అమలు.. సంక్షేమం, అభివృద్ధి సమపాళ్లలోఎన్నికలకు ముందు చెప్పిన హామీలను ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో నెరవేరుస్తున్నామని ఎమ్మెల్యే గారు అన్నారు. గత ప్రభుత్వంలో అస్తవ్యస్తమైన ఆర్థిక వ్యవస్థను సరిదిద్దుకుంటూనే సంక్షేమం, అభివృద్ధిని సమపాళ్లలో ముందుకు తీసుకెళ్తున్నామని చెప్పారు. రూ.3 వేల నుంచి రూ.4 వేలకు పెంచిన పింఛన్‌ను ప్రతి నెలా ఒకటో తేదీన, సెలవు అయితే ముందు రోజే అందిస్తున్నామని, తల్లికి వందనం, స్త్రీ శక్తి కింద ఉచిత బస్సు ప్రయాణం, మూడు ఉచిత సిలిండర్లు, అన్నదాత సుఖీభవ, చేనేత, మత్స్యకార, ఆటో సేవలు అమలవుతున్నాయని తెలిపారు. రైతులకు 16 గంటల విద్యుత్ ఇస్తూ కరెంటు చార్జీలు పెంచకుండా చూస్తున్నామని, 'మీ భూమి మీ హక్కు' పేరుతో రాజముద్రతో పట్టాదారు పాస్ పుస్తకాలు అందించామని పేర్కొన్నారు. ఏళ్ల తరబడి తవ్వని కాలువల పూడికతీత, కనెక్టింగ్ బ్రిడ్జిలు, రోడ్ల మరమ్మతులు, పాఠశాలల అభివృద్ధి పనులు చేపట్టామని, మిగిలిన సీసీ డ్రెయిన్లు, రోడ్లను త్వరలో పూర్తి చేస్తామని చెప్పారు. 'చేసేశాం' అని చెప్పడం లేదని, చెప్పిన ప్రతి పనినీ ఒకదాని తర్వాత ఒకటి పూర్తి చేస్తున్నామని అన్నారు. జడ్పీటీసీ అభ్యర్థి శ్రీ శివరామకృష్ణారెడ్డి గారు నీతి, నిజాయితీతో, అవినీతి రహితంగా అందరికీ అందుబాటులో ఉండే నాయకుడని పేర్కొన్నారు.

**రేబాలలో రూ.5.85 కోట్ల పనులు**

రేబాల పంచాయతీలో ఇప్పటివరకు రూ.5.85 కోట్ల విలువైన అభివృద్ధి, సంక్షేమ పనులు జరిగాయని ఎమ్మెల్యే గారు తెలిపారు. ఇరిగేషన్ శాఖలో రూ.52.71 లక్షలు, పంచాయతీరాజ్‌లో రూ.1.65 కోట్లు, విద్యుత్ శాఖలో రూ.1.44 కోట్లు, ఆర్‌డబ్ల్యూఎస్‌లో రూ.1.09 కోట్లు వెచ్చించామని, సీఎంఆర్‌ఎఫ్ కింద పేదలకు రూ.13.14 లక్షలు అందించామని చెప్పారు. అధికారంలోకి రాగానే శివరామకృష్ణారెడ్డి గారిని ప్రతిష్టాత్మకమైన బుచ్చి బ్యాంక్ చైర్మన్‌గా ముఖ్యమంత్రి గారు నియమించారని గుర్తుచేశారు. ఇరవై ఏళ్లుగా తవ్వని కాలువలను తవ్వి రైతులకు అండగా నిలిచామని, నీళ్లు పుష్కలంగా ఇవ్వడంతో రైతులందరికీ నాలుగు



పంటలు పండాయని చెప్పారు.

**దామరమడుగులో రూ.4.80 కోట్ల అభివృద్ధి, సంక్షేమ పనులు**

దామరమడుగు పంచాయతీలో ఇప్పటివరకు రూ.4.80 కోట్ల విలువైన పనులు జరిగాయని ఎమ్మెల్యే గారు తెలిపారు. ఇరిగేషన్ శాఖలో రూ.40 లక్షలతో కాలువ పూడికతీత, మరమ్మతులు పూర్తి చేశామని, రూ.1.18 కోట్లతో మూడు పనులు మంజూరయ్యాయని, ఎన్నికల కోడ్ ముగిసిన తర్వాత వాటిని పూర్తి చేస్తామని చెప్పారు. పంచాయతీరాజ్‌లో రూ.25.30 లక్షలతో ఐదు సీసీ రోడ్లు, ఆర్ఆర్ నగర్‌లోని ముస్లిం బరియల్ గ్రౌండ్ ప్రహరీ, లెవలింగ్ పనులు పూర్తయ్యాయని, రూ.16 లక్షలతో రెండు సీసీ రోడ్లు, దామరమడుగు--1లో విలేజ్ హెల్త్ క్లినిక్ పనులు జరుగుతున్నాయని, దామరమడుగు--2లో రూ.19 లక్షలతో విలేజ్ హెల్త్ క్లినిక్ మంజూరైందని తెలిపారు. విద్యుత్ శాఖలో రూ.86.16 లక్షలతో వివిధ పనులు చేపట్టామని పేర్కొన్నారు. ఆర్‌డబ్ల్యూఎస్‌లో రూ.32.33 లక్షలతో 11 డ్రెయిన్ వర్క్స్, పైప్‌లైన్ పనులు పూర్తి చేశామని, రూ.14 లక్షలతో మూడు పనులు జరుగుతున్నాయని, రూ.63.90 లక్షల జల్ జీవన్ మిషన్ పనులు మంజూరయ్యాయని చెప్పారు. ఆర్ అండ్ బీ ద్వారా రూ.5 లక్షలతో రెండు ప్యాచ్ వర్క్‌లు పూర్తయ్యాయని, వీపీఆర్ ఫౌండేషన్ సీఎస్ఆర్ కింద దామరమడుగు జడ్పీ స్కూల్‌కు రూ.30 లక్షలు, ఎంపీపీ ఎలిమెంటరీ స్కూల్ లెవలింగ్‌కు రూ.1 లక్ష అందించామని తెలిపారు. సీఎంఆర్‌ఎఫ్ ద్వారా 37 మందికి రూ.29.82 లక్షలు అందించామని వివరించారు. గత ఎన్నికల్లో దామరమడుగు ప్రజలు చరిత్ర తిరగరాస్తూ తొలిసారి తెలుగుదేశం పార్టీకి పట్టం కట్టారని, అందుకు శిరను వంచి నమస్కరిస్తున్నానని అన్నారు. రాబోయే రోజుల్లో దామరమడుగును మరింత అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు.

**కాలయకాగళ్లులో రూ.2.03 కోట్ల పనులు.. కోవూరు కాలువపై కొత్త వంతెన**

కాలయకాగళ్లు పంచాయతీలో ఇప్పటివరకు రూ.2.03 కోట్ల విలువైన పనులు జరిగాయని ఎమ్మెల్యే గారు తెలిపారు. ఎంపీటీసీ అభ్యర్థి శ్రీమతి పేరం జానకమ్మ గారి తండ్రి గతంలో సర్పంచ్‌గా పనిచేశారని, ఆ నేపథ్యం చూసి ఆమెను నిలబెట్టామని చెప్పారు. ఇరిగేషన్ శాఖలో రూ.7.50 లక్షలతో పంట కాలువల మరమ్మతులు, రూ.89.99 లక్షలతో కోవూరు కాలువపై వంతెన నిర్మాణం జరుగుతోందని, ఇరవై, ముప్పై ఏళ్లుగా శిథిలావస్థలో ఉన్న ఈ వంతెన రైతుల రాకపోకలకు, ధాన్యం తరలింపునకు ఎంతో ఉపయోగపడుతుందని స్థానికులు చెప్పడంతో మంజూరు చేయించామని తెలిపారు. పంచాయతీరాజ్‌లో రూ.15 లక్షలతో మూడు సీసీ రోడ్లు, రూ.20 లక్షలతో విలేజ్ హెల్త్ క్లినిక్ పనులు జరుగుతున్నాయని, రూ.15 లక్షలతో సీసీ రోడ్డు, శ్మశానవాటిక ప్రహరీ పనులు మంజూరయ్యాయని పేర్కొన్నారు.విద్యుత్ శాఖలో ఆర్‌డీఎస్ఎస్ ద్వారా రూ.30.33 లక్షలతో త్రీఫేజ్, 24 గంటల కరెంట్ సరఫరా అందించామని, ఆర్‌డబ్ల్యూఎస్‌లో రూ.5.80 లక్షలతో ఆరు సీసీ డ్రెయిన్లు, రూ.13.21 లక్షలతో తాగునీటి పనులు చేశామని తెలిపారు. సీఎంఆర్‌ఎఫ్ ద్వారా ఎనిమిది మందికి రూ.6.80 లక్షలు అందించామని చెప్పారు. పల్లె పండుగ 3.0 కింద నియోజకవర్గానికి రూ.11 కోట్లు రాగా, గ్రామాలకు వెళ్లే లింక్ రోడ్ల మరమ్మతులు చేపడుతున్నామని వివరించారు. గ్రామస్థులు కోరిన ఇతర పనులను వీపీఆర్ ఫౌండేషన్, సీఎస్ఆర్ నిధుల ద్వారా మంజూరు చేయించి చేపడతామని హామీ ఇచ్చారు.

**పెనుబల్లిలో రూ.4.17 కోట్ల పనులు.. రైతులకు పట్టాలు, 200 ఎకరాలకు దారి**

కోవూరు నియోజకవర్గంలోని 82 పంచాయతీల్లో ప్రతిచోటా పనులు చేశామని చెప్పిన ఎమ్మెల్యే గారు, పెనుబల్లిలో ఇప్పటివరకు రూ.4.17 కోట్ల విలువైన పనులు జరిగాయని తెలిపారు. ఇరిగేషన్ శాఖలో రూ.52.29 లక్షలతో 10 కాలువల పూడికతీత, మరమ్మతులు చేశామని, రూ.17.27 లక్షలతో రెండు పనులు మంజూరయ్యాయని చెప్పారు. పంచాయతీరాజ్‌లో రూ.23.80 లక్షలతో నాలుగు సీసీ రోడ్లు, రూ.36 లక్షలతో విలేజ్ హెల్త్ క్లినిక్, రూ.26 లక్షలతో ఏడు సీసీ రోడ్లు మంజూరయ్యాయని, రూ.5 లక్షలతో సీసీ రోడ్డు పనులు, రూ.1.50 కోట్లతో పెనుబల్లి--మినగల్లు రోడ్డు పనులు జరుగుతున్నాయని పేర్కొన్నారు. విద్యుత్ శాఖలో టీ అండ్ డీ గ్రాంట్ ద్వారా రూ.11.80 లక్షలతో వివిధ పనులు, ఆర్‌డీఎస్ఎస్ ద్వారా రూ.28.06 లక్షలతో త్రీఫేజ్, 24 గంటల కరెంట్ సరఫరా అందించామని తెలిపారు. ఆర్‌డబ్ల్యూఎస్‌లో రూ.47.72 లక్షలతో 13 సీసీ డ్రెయిన్లు, టీటీడీ భజన మందిరం పథకం కింద ఎస్టీ కాలనీలో వినాయకస్వామి గుడి (భజన మందిరం) నిర్మాణానికి రూ.40 లక్షలు మంజూరయ్యాయని, ఎన్నికల తర్వాత ఆ పనులు చేపడతామని చెప్పారు. వీపీఆర్ ఫౌండేషన్ సీఎస్ఆర్ ద్వారా సాల్మాన్‌పురంలో శ్మశానవాటిక ప్రహరీ, లెవలింగ్ పనులకు రూ.10 లక్షలు, తాగునీటి పనులకు రూ.3.20 లక్షలు అందించామని, శ్మశానవాటికను మొత్తం రూ.20 లక్షలతో పూర్తి చేశామని తెలిపారు. సీఎంఆర్‌ఎఫ్ ద్వారా 10 చెక్కులకు రూ.14.93 లక్షలు అందించామని వివరించారు. ప్రచారానికి వచ్చినప్పుడు రైతులు చెప్పిన సమస్యల్లో సగమైనా తీర్చామని భావిస్తున్నట్లు ఎమ్మెల్యే గారు అన్నారు. సాదా బైనామా కింద ఉన్న రైతులకు పట్టాలు ఇప్పిస్తామని ఇచ్చిన మాటకు సంబంధించిన ఫైల్ కలెక్టర్ గారి వద్ద ఉందని, ఎన్నికల తర్వాత ఇస్తామని ఆయన హామీ ఇచ్చారని తెలిపారు. అలాగే రెండు వందల ఎకరాల రైతులకు దారి ఇచ్చి తీరుతామని మాట ఇచ్చారు.

**జొన్నవాడలో రూ.1.41 కోట్ల పనులు.. అవినీతి రహిత కోవూరు దిశగా**

జొన్నవాడ కామాక్షి తాయి సాక్షిగా అవినీతి రహిత కోవూరు నియోజకవర్గం చేస్తామని చెప్పామని, అక్షరాలా చేసి చూపించామని ఎమ్మెల్యే గారు అన్నారు. ఈ పంచాయతీలో ఇప్పటివరకు రూ.1.41 కోట్ల విలువైన పనులు జరిగాయని తెలిపారు. ఇరిగేషన్ శాఖలో రూ.14.90 లక్షలతో కాలువల పూడికతీత, మరమ్మతులు, పంచాయతీరాజ్‌లో రూ.10 లక్షలతో సీసీ రోడ్డు, రూ.15 లక్షలతో ఐదు సీసీ రోడ్లు మంజూరయ్యాయని చెప్పారు. విద్యుత్ శాఖలో టీ అండ్ డీ గ్రాంట్ ద్వారా రూ.2.02 లక్షలతో వివిధ పనులు చేపట్టామని, ఆర్‌డబ్ల్యూఎస్‌లో రూ.62.50 లక్షలతో 18 సీసీ డ్రెయిన్లు, పంపుసెట్లు, రూ.13.50 లక్షలతో తాగునీటి సదుపాయం కల్పించామని పేర్కొన్నారు.

వీపీఆర్ ఫౌండేషన్ సీఎస్ఆర్ కింద రూ.15 లక్షలతో సీసీ డ్రెయిన్లు, ఇంకుడు గుంతలు నిర్మించామని, సీఎంఆర్‌ఎఫ్ ద్వారా 10 మందికి రూ.12.10 లక్షలు అందించామని వివరించారు. ఇప్పటివరకు గడిచింది రెండున్నరేళ్లు మాత్రమేనని, ఇంకా రెండున్నరేళ్లు ఉందని, ఇళ్లు, ఇంటి పట్టాలు, రోడ్లు, డ్రెయిన్లు వంటి పనులు చేయాల్సి ఉందని చెప్పారు.

**నామినేషన్ ఉపసంహరణకు అంగీకారం**

కూటమిలో స్థానం దక్కకపోవడంతో స్వతంత్ర అభ్యర్థిగా నామినేషన్ వేసిన తెలుగుదేశం నేత పెంచల ప్రసాద్ గారిని ఎమ్మెల్యే గారు, బీజేపీ జిల్లా అధ్యక్షులు వంశీ గారితో పాటు వెళ్లి కలిశారు. ఆ స్థానంలో కూటమి తరఫున నిలిచిన బీజేపీ అభ్యర్థి శ్రీ కేతన్ గారికి సహకరించాలని సూచించారు. దీంతో ఆయన తన నామినేషన్‌ను ఉపసంహరించుకునేందుకు అంగీకరించారు. ఈ నిర్ణయానికి సహకరించిన పెంచల ప్రసాద్ కి ఎమ్మెల్యే ధన్యవాదాలు తెలిపారు.

# సూళ్లూరుపేట 31వ వార్డులో జోరుగా వైఎస్సార్‌సీపీ ప్రచారం

## ప్రజల సమస్యల పరిష్కారమే ప్రధాన లక్ష్యం గ్రద్దగుంట లక్ష్మి సౌందర్య

సూళ్లూరుపేట అర్బన్ (ఇది నిజం ప్రతినిధి) సూళ్లూరుపేట పట్టణంలోని కోళ్ళ మిట్ట, ఎర్రబాలెం, డీఓఎస్ కాలనీ పరిధిలో ఆదివారం వైఎస్సార్‌సీపీ 31వ వార్డు అభ్యర్థి గ్రద్దగుంట లక్ష్మి సౌందర్య ఆధ్వర్యంలో ఎన్నికల ప్రచారం జోరుగా సాగింది. ఈ సందర్భంగా ఆమె ఇంటింటికీ వెళ్లి ప్రజలను కలుసుకుంటూ, వార్డు అభివృద్ధికి తనకు అవకాశం కల్పించాలని ఓటర్లను అభ్యర్థించారు. ఈ సందర్భంగా లక్ష్మి సౌందర్య మాట్లాడుతూ, "సూళ్లూరుపేట మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య ఆశీర్వాదంతో, పార్టీ నాపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ ప్రజాసేవకు ముందుకు వచ్చాను. మీ అమూల్యమైన ఓటుతో నన్ను గెలిపించి, ప్రజలకు సేవ చేసే అవకాశం కల్పించాలని కోరుతున్నాను" అని అన్నారు."వార్డులోని ప్రజల సమస్యలను స్వయంగా తెలుసుకుని, వాటి పరిష్కారానికి కృషి చేయడంతో పాటు, స్థానిక అభివృద్ధికి పెద్దపీట వేయడం నా ప్రధాన లక్ష్యం. ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించేందుకు నిరంతరం పనిచేస్తాను" అని ఆమె పేర్కొన్నారు.ప్రచారంలో భాగంగా స్థానిక ప్రజల సమస్యలను అడిగి తెలుసుకుంటూ, వార్డు అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ ప్రచార కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, అభిమానులు పాల్గొని అభ్యర్థికి మద్దతుగా ప్రచారం నిర్వహించారు.



# గ్రామీణ ప్రాంత ప్రజల ముంగిటికే కార్పొరేట్ వైద్యం

## ఎం.వి. రావు ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం

కోట. (ఇది నిజం ప్రతి నిది)కోట మండలం గూడలి పంచాయతీ పరిధిలోని ప్రకాశం కాలనీ గిరిజన కాలనీ ఆవరణలో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. గ్రామీణ ప్రాంత ప్రజల ముంగిటికే కార్పొరేట్ వైద్య సేవలు అందిస్తున్నామని ఎం వి రావు ఫౌండేషన్ చైర్మన్ ముప్పవరపు లీలా మోహన్ కృష్ణ అన్నారు ఈ వైద్య శిబిరాన్ని ఎం వి రావు ఫౌండేషన్ చైర్మన్ లీలమోహన్ కృష్ణ ప్రారంభించి ఈ ప్రాంత గిరిజన కాలనీవాసులకు వైద్య సేవలు అందించారు. గిరిజన కాలనీ వాసులందరికీ ఉచిత కంటి వైద్య శిబిరం ఏర్పాటు చేసి కంటి పరీక్షలు నిర్వహించి దృష్టిలోపం ఉన్న వారిని గుర్తించారు.అదేవిధంగా కాలనీవాసులకు బీపీ షుగర్ లాంటి వ్యాధులకు ఉచితంగా పరీక్షలు చేసి వారికి వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేపట్టారు. దృష్టిలోపం ఉన్నవారికి కంటి అద్దాలు, కంటిలో శుక్లాలు ఉన్నవారికి ఉచితంగా వాసన్ ఐ కేర్ ఆసుపత్రి నందు కంటి ఆపరేషన్లు నిర్వహిస్తామని ఎం వి రావు ఫౌండేషన్ చైర్మన్ లీలా మోహన్ కృష్ణ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంవి రావు ఫౌండేషన్ చైర్మన్ ముప్పవరపు లీలా మోహన్ కృష్ణ కార్యదర్శి ఎం విజయలక్ష్మి, కంటి వైద్య నిపుణులు రమేష్ వారి సిబ్బంది గిరిజన కాలనీవాసులు పాల్గొన్నారు.



# సూళ్లూరుపేట మున్సిపాలిటీలో వైసీపీ చైర్మన్ అభ్యర్థి విమల కుమారి, వార్డ్ కౌన్సిలర్ అభ్యర్థులతో కలసి ఎన్నికల ప్రచారం ప్రారంభం





సూళ్లూరుపేట అర్బన్ (ఇది నిజం ప్రతినిధి )సూళ్లూరుపేట మున్సిపాలిటీ పరిధిలోని 10వ, 11వ వార్డుల్లో చైర్మన్ అభ్యర్థి విమల కుమారి మోదీ గారు, వార్డు కౌన్సిలర్ అభ్యర్థులతో కలిసి ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించారు.మున్సిపల్ అబ్జర్వర్ జెట్టి వేణు యాదవ్ గారి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ప్రచార కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు వేల్లపాలెం కృపాకర్ రెడ్డి, చెన్నారెడ్డి సుబ్రమణ్యం, కామిరెడ్డి మోహన్ రాజా రెడ్డి, గజేంద్ర , అఖిల్ తదితరులు పాల్గొని ప్రజలను కలిసి ప్రచారం నిర్వహించారు.
ఈ సందర్భంగా వార్డుల్లో ప్రజల సమస్యలను తెలుసుకుంటూ, స్థానిక అభివృద్ధి మరియు ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించడమే లక్ష్యంగా నాయకులు ముందుకు సాగారు. రానున్న మున్సిపల్ ఎన్నికల్లో ప్రజల మద్దతుతో విజయం సాధించేందుకు నాయకులు, కార్యకర్తలు ఉత్సాహంగా ప్రచారంలో పాల్గొన్నారు.

# మత పెద్దల ఆశీర్వాదం తీసుకున్న మేయర్ అభ్యర్థి జయశ్రీ



నెల్లూరు (ఇదినిజం ప్రతినిధి ): నెల్లూరు నగరపాలక సంస్థ మేయర్ పీఠానికి స్వతంత్ర అభ్యర్థిగా బరిలో ఉన్న విద్యావంతురాలు ఎన్. జయశ్రీ ప్రచారాన్ని ముమ్మరం చేశారు.ఆదివారం నగరంలోని కరెంట్ ఆఫీస్ సెంటర్ వద్ద ఉన్న చర్చి మత పెద్దలను ఆమె కలిసి ఆశీర్వాదం తీసుకున్నారు.ఈ సందర్భంగా జయశ్రీ మాట్లాడుతూ... నెల్లూరు నగర అభివృద్ధి, మహిళా సాధికారత, కార్మికుల హక్కులు, సంక్షేమ పథకాల అమలుకే నా ప్రాధాన్యత అని తెలిపారు. నవంబర్ 1న జరిగే పోలింగ్‌లో తనకు కేటాయించిన 'బీరువా' గుర్తుపై తమ పవిత్రమైన ఓటు వేసి తమ ఇంటి బిడ్డను ఆశీర్వదించాలని ఆమె విజ్ఞప్తి చేశారు.

# పద్మావతి సెంటర్ లో జయశ్రీ విస్తృత ప్రచారం



నెల్లూరు (ఇదినిజం ప్రతినిధి ): నెల్లూరు నగర మేయర్ స్వతంత్ర అభ్యర్థి, విద్యావంతురాలు ఎన్. జయశ్రీ ఎన్నికల ప్రచారంలో జోరు పెంచారు.శనివారం నగరంలోని పద్మావతి సెంటర్‌లో ఆమె ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఓటర్లను దేవుళ్లుగా భావిస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు.మహిళా అభ్యర్థిగా బరిలో ఉన్న జయశ్రీకి నగర ప్రజల నుంచి, ముఖ్యంగా మహిళా ఓటర్ల నుంచి ఊహించని స్పందన లభిస్తోంది. మహిళకు మద్దతుగా నిలవాలని నెల్లూరు ఓటర్లు భావిస్తున్నారు.నవంబర్ 1న జరిగే ఎన్నికల్లో తనకు కేటాయిచ్చిన బ్యాలెట్ నమూనా నందు సీరియల్ నెంబర్ 8 గా ఉన్న మన గుర్తు బీరువా గుర్తుపై మీ పవిత్రమైన ఓటు వేసి గెలిపించండి అని ఈ సందర్భంగా జయశ్రీ విజ్ఞప్తి చేశారు.

# మణుగూరు కండక్టర్‌పై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలి

## ఎంప్లాయిస్ యూనియన్ మధిర డిపో కమిటీ డిమాండ్



మధిర అక్టోబర్ 25 (ఇదినిజం ప్రతినిధి): టి జి ఎస్ ఆర్ టి సి ఖమ్మం రీజియన్‌లోని లిమణుగూరు డిపో కండక్టర్ ప్రవళికపై విధి నిర్వహణలో జరిగిన దాడిని ఎంప్లాయిస్ యూనియన్ మధిర డిపో కమిటీ తీవ్రంగా ఖండించిందిలి. దాడికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆర్టీసీ యాజమాన్యాన్ని, ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు రాష్ట్రంలో మహాలక్ష్మి పథకం అమల్లోకి వచ్చినప్పటి నుంచి విధి నిర్వహణలో ఉన్న కండక్టర్లు, డ్రైవర్లపై దాడులు పెరుగుతున్నాయని యూనియన్ నాయకులు ఆందోళన వ్యక్తం చేశారు. ప్రయాణికుల అసంతృప్తిని సిబ్బందిపై చూపించడం సరికాదని, కార్మికులకు రక్షణ కల్పించాల్సిన బాధ్యత ఆర్టీసీ యాజమాన్యం, ప్రభుత్వంపై ఉందని పేర్కొన్నారు. బస్సుల్లో ప్రకటనలు ఇవ్వడంతోనే సరిపెట్టకుండా, దాడులకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, ప్రవళికపై దాడి చేసిన వారిని శిక్షించి ఆర్టీసీ సిబ్బందికి భరోసా కల్పించాలని గాయపడిన కండక్టర్ ప్రవళిక కు మెరుగైన వైద్యం అందించాలని,భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కార్మికులకు రక్షణ కల్పించాలని వారు డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి తిమ్మినేని రామారావు, రాష్ట్ర ఉపాధ్యక్షురాలు అరుణకుమారి, రాష్ట్ర సహాయ కార్యదర్శి రాంచందర్ రావు, మధిర డిపో అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, డిపో కార్యదర్శి షేక్ నాగుల్ మీరా, నాయకులు వి. రామకృష్ణ, సత్యనారాయణ, హరికృష్ణ, శ్యామ్ బాబు, ఎస్.కె. రహీం, షాకీర్, సాయికుమార్, సరస్వతి, నాగమల్లేశ్వరి, రాధిక తదితరులు పాల్గొన్నారు.

# వెన్నెలగడ్డ చెరువును ప్లాస్టిక్ రహితంగా మార్చేందుకు అవగాహన కార్యక్రమం

## ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించి పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి



కుత్బుల్లాపూర్ (ఇదినిజం ప్రతినిధి):: పర్యావరణ పరిరక్షణ, చెరువుల పరిశుభ్రతే లక్ష్యంగా జీడిమెట్ల గ్రామ పరిధిలోని వెన్నెలగడ్డ చెరువును ప్లాస్టిక్ రహిత ప్రాంతంగా తీర్చిదిద్దేందుకు ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆదివారం ఉదయం 8.30 గంటలకు సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కుత్బుల్లాపూర్ జోనల్ కమిషనర్ శ్రీ పింకేష్ కుమార్ ఐఏఎస్ ఆధ్వర్యంలో'చూరాజ్ఞు ఔనూ, బ్లూ ఓషన్ ప్రాజెక్ట్ సంస్థల ప్రతినిధులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.చెరువులో ప్లాస్టిక్ వ్యర్థాల వల్ల కలిగే పర్యావరణ నష్టాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించడం, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం, చెరువుల పరిరక్షణలో ప్రజలు భాగస్వాములు కావడం వంటి అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా బ్లూ ఓషన్ ప్రాజెక్ట్ ప్రతినిధుల ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని కూడా నిర్వహించారు.స్వచ్ఛమైన నీరు, ఆరోగ్యకరమైన భూమి, ఉజ్వల భవిష్యత్తు అనే లక్ష్యంతో వెన్నెలగడ్డ చెరువును ప్లాస్టిక్ రహిత ప్రాంతంగా మార్చేందుకు ఈ కార్యక్రమం చేపట్టారు. చెరువుల పరిరక్షణ కేవలం అధికారుల బాధ్యత మాత్రమే కాకుండా ప్రతి పౌరుడి సామాజిక బాధ్యత అని, పర్యావరణాన్ని కాపాడేందుకు ప్రజలు సహకరించాలని ఈ కార్యక్రమం ద్వారా సందేశాన్ని అందించారు.ఈ కార్యక్రమంలో జీడిమెట్ల సర్కిల్ ఉప కమిషనర్ డి. శంకర్ సింగ్, సంస్థల ప్రతినిధులు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. యూబీడీ మేనేజర్ మహేందర్, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ దుర్గా ప్రసాద్, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ (ఎస్‌డబ్ల్యూఎం) శివ ప్రకాష్, అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ సాయి నికితా సేన్, స్థానిక ప్రజాప్రతినిధులు, కుత్బుల్లాపూర్ జోన్ మరియు జీడిమెట్ల సర్కిల్ సిబ్బంది హాజరయ్యారు.

# మధిర జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు కేటాయించాలి

## కాంగ్రెస్ మేనిఫెస్టో హామీని అమలు చేయాలి

## కలం కార్మికులకు న్యాయం చేయాలి

## పొంగులేటి ప్రకటనతో జర్నలిస్టులో పెరిగిన ఆశలు

మధిర అక్టోబర్ 25 (ఇదినిజం ప్రతినిధి): కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో పేర్కొన్న విధంగా మధిర ప్రాంత జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు కేటాయించి, కలం కార్మికులకు న్యాయం చేయాలని జర్నలిస్టులు కోరుతున్నారు. ప్రజాస్వామ్యంలో ప్రజల సమస్యలను వెలుగులోకి తీసుకువస్తూ, నిరంతరం ప్రజల పక్షాన పని చేస్తున్న జర్నలిస్టులకు సొంత ఇంటి కలను నెరవేర్చేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు. మధిరలో కొంత మంది జర్నలిస్టులు 30 సంవత్సరాలుగా పనిచేస్తున్నారు. ఇంతవరకు వారికి ఇళ్ల స్థలాలు ఇవ్వలేదు.గతంలో జర్నలిస్టులకి ఇళ్ల స్థలాలు ఇవ్వాలని మధిరలో వారం రోజులపాటు రిలే నిరాహార దీక్షలు చేశారు. వీటిని ప్రారంభించేందుకు ప్రతిపక్ష నేతగా ఉన్న ప్రస్తుత తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, నాటి ఎంపీ, ప్రస్తుత రాష్ట్ర సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి మధిరకు వచ్చి జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు కేటాయిస్తామని హామీ ఇచ్చిన విషయాన్ని ఈ సందర్భంగా జర్నలిస్టులు గుర్తుచేస్తున్నారు. అంతేకాకుండా నాకు ప్రతిపక్ష నేతగా ఉన్న మల్లు భట్టి విక్రమార్కని మధిర కు చెందిన సీనియర్ జర్నలిస్టులు ప్రత్యేకంగా ఖమ్మంలో కలిసి జర్నలిస్టులకు ఇవ్వాలని కోరడం జరిగింది. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన మేనిఫెస్టోలో జర్నలిస్టుల సంక్షేమానికి ఇచ్చిన హామీలను అధికారంలోకి వచ్చిన తర్వాత అమలు చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని వారు పేర్కొంటున్నారు. ప్రజా సమస్యలపై నిరంతరం వార్తలు రాస్తూ, ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధిగా పనిచేస్తున్న జర్నలిస్టులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటు న్నారని తెలిపారు.మధిర ప్రాంతంలో పనిచేస్తున్న జర్నలిస్టుల్లో చాలామందికి సొంత ఇళ్లు, ఇంటి స్థలాలు లేవని, అద్దె ఇళ్లలో నివసిస్తూ విధులు నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు. జర్నలిస్టుల ఆర్థిక పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని, వారికి ఇళ్ల స్థలాలు కేటాయించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని కోరుతున్నారు. హామీల అమలుపై ఆశలుప్రస్తుత ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి గతంలో ఇచ్చిన హామీలను గుర్తుచేసుకొని, మధిర జర్నలిస్టులకు న్యాయం చేయాలని జర్నలిస్టులు విజ్ఞప్తి చేస్తున్నారు.ప్రభుత్వం జర్నలిస్టుల సంక్షేమానికి ప్రాధాన్యతనిస్తూ, అర్హులైన జర్నలిస్టులను గుర్తించి ఇళ్ల స్థలాల కేటాయింపు



ప్రక్రియను ప్రారంభించాలని కోరుతున్నారు. ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీని అమలు చేసి, మధిర జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు కేటాయిస్తే వారి కుటుంబాలకు భరోసా కలుగుతుందని, జర్నలిస్టుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందనే రాష్ట్ర సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి నిన్న మీడియా సాక్షిగా చెప్పిన విషయాన్ని జర్నలిస్టులో మరోసారి ఆశలను నెలకొల్పాయి. కాంగ్రెస్ ప్రభుత్వం మాటలకే పరిమితం కాకుండా అర్హులైన జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని మధిర ప్రధాన ప్రెస్ క్లబ్ కోరుతుంది.




## 'రంగులు రంగేళీ' పేరుతో మూడో సింగిల్ రిలీజ్

- 'రామాయణ' నుంచి కొత్త పాట విడుదల
- ఏఆర్ రెహమాన్ సంగీతం.. రాకేందు మౌళి సాహిత్యం
- రామసీతల పవిత్ర బంధాన్ని ఆవిష్కరిస్తున్న గీతం

బాలీవుడ్ స్టార్ రణ్‌బీర్ కపూర్, సాయి పల్లవి ప్రధాన పాత్రల్లో నటిస్తున్న ప్రతిష్ఠాత్మక చిత్రం 'రామాయణ' నుంచి మరో ఆసక్తికర అప్‌డేట్ వచ్చింది. ఈ సినిమా నుంచి 'రంగులు రంగేళీ' పేరుతో మూడో పాటను చిత్రబృందం విడుదల చేసింది. నితీశ్ తివారీ దర్శకత్వంలో రెండు భాగాలుగా తెరకెక్కుతున్న ఈ చిత్రంలో రణ్‌బీర్ కపూర్ శ్రీరాముడిగా, సాయి పల్లవి సీతాదేవిగా కనిపించనున్నారు. ఏఆర్




రెహమాన్ సంగీతం అందించిన ఈ పాటకు రాకేందు మౌళి సాహిత్యం సమకూర్చారు. రాఘవ్ కౌశిక్, వైశాలి సమంత్ తమ గాత్రంతో పాటకు ప్రాణం పోశారు. భారతీయ సంగీత సంప్రదాయాల మాధుర్యాన్ని ఆధునిక స్వరాలతో మేళవిస్తూ ఈ గీతాన్ని రూపొందించారు. రామసీతల అనుబంధమే ప్రధానంగా సాగిన ఈ పాటలో వారి జీవితంలోని కీలకఘట్టాలను అందంగా ఆవిష్కరించారు. స్వయంవరం, వివాహం, అయోధ్యలోని ఆనందకర జీవితం, అరణ్యవాసం వంటి సన్నివేశాలను పాటలోని దృశ్యాలతో మేళవించారు. ప్రేమ, అనురాగం, త్యాగం వంటి భావాలను ప్రతిబింబించేలా పాటను తీర్చిదిద్దారు. ఇప్పటికే ఈ సినిమాపై ప్రేక్షకుల్లో భారీ అంచనాలు నెలకొనగా, కొత్త పాట విడుదలతో ప్రచార కార్యక్రమాలు మరింత ఊపందుకున్నాయి. భారతీయ ఇతిహాసమైన రామాయణాన్ని భారీ స్థాయిలో వెండితెరపై ఆవిష్కరించేందుకు చిత్రబృందం సిద్ధమవుతోంది. నవంబర్ 5న సినిమా తొలి భాగాన్ని ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల చేయనున్నట్లు ప్రకటించారు. రణ్‌బీర్ కపూర్, సాయి పల్లవిల పాత్రలు, ఏఆర్ రెహమాన్ సంగీతం ఈ చిత్రానికి ప్రధాన ఆకర్షణలుగా నిలుస్తాయని అభిమానులు ఆశిస్తున్నారు.

## క్రీమ్ కలర్ చీరలో శ్వేతా బసు

- సింపుల్‌గా ఆకట్టుకుంటున్న బ్యూటీ
- సోషల్ మీడియాలో వైరల్‌గా మారిన తాజా ఫొటోలు

నటి శ్వేతా బసు ప్రసాద్ తన తాజా ఫొటోలతో సోషల్ మీడియాలో సందడి చేస్తున్నారు. తాజాగా ఆమె ఇన్‌స్టాగ్రామ్‌లో షేర్ చేసిన ఫొటోలు అభిమానులను ఆకట్టుకుంటున్నాయి. లేత క్రీమ్ రంగు చీరలో సింపుల్‌గా, అందంగా కనిపిస్తూ తనదైన స్టైల్‌తో మెప్పిస్తున్నారు. చీరపై ఉన్న సున్నితమైన బంగారు రంగు ఎంబ్రాయిడరీ ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది. స్లీవ్‌లెస్ బ్లౌజ్‌తో చీరను అందంగా కట్టుకున్న ఆమె, చీర కొంగును చేతులతో పట్టుకుని వివిధ భంగిమల్లో ఫొటోలకు పోజులిచ్చారు. ముఖంపై మృదువుగా జాలువారుతున్న హెయిర్‌స్టైల్, మెడలో సింపుల్ నెక్లెస్, చెవులకు అందమైన ఇయర్ రింగ్స్ ఆమె లుక్‌ను మరింత ఆకర్షణీయంగా మార్చాయి. వెచ్చని రంగుల స్టూడియో బ్యాక్‌డ్రాప్‌లో దిగిన ఈ ఫొటోలు సంప్రదాయ అందానికి, ఆధునిక స్టైల్‌కు అద్దం పడుతున్నాయి. శ్వేతా బసు ప్రసాద్ సింపుల్ లుక్ నెటిజన్లను ఆకట్టుకుంటోంది.






## ఆస్ట్రేలియా వీధుల్లో కయాదు లోహర్ సందడి

- స్టైలిష్ లుక్స్‌లో 'ప్యారడైజ్' బ్యూటీ
- సిడ్నీ ఒపెరా హౌస్, హార్బర్ బ్రిడ్జ్ వద్ద ఫొటోషూట్
- రాయల్ బ్లూ డ్రెస్‌లో మెరిసిన హీరోయిన్

టాలీవుడ్ బ్యూటీ కయాదు లోహర్ తన స్టైలిష్ లుక్స్‌తో సోషల్ మీడియాలో సందడి చేస్తోంది. సినిమాలతో బిజీగా ఉంటూనే వ్యక్తిగత జీవితానికి సంబంధించిన విశేషాలను అభిమానులతో పంచుకుంటున్న ఈ ముద్దుగుమ్మ, తాజాగా ఆస్ట్రేలియా పర్యటనకు సంబంధించిన ఫొటోలను సోషల్ మీడియాలో షేర్ చేసింది. సిడ్నీ ఒపెరా హౌస్, సిడ్నీ హార్బర్ బ్రిడ్జ్ వంటి ప్రముఖ ప్రదేశాల్లో దిగిన ఫొటోలు నెట్టింట వైరల్‌గా మారాయి. ఆమె లుక్స్‌కు అభిమానులు ఫిదా అవుతున్నారు. కయాదు లోహర్ శ్రీవిష్ణు నటించిన 'అల్లూరి' సినిమాతో తెలుగు ప్రేక్షకులకు పరిచయమైంది. ఆ తర్వాత తమిళ, మలయాళ చిత్రాల్లోనూ నటిస్తూ గుర్తింపు తెచ్చుకుంది. విశ్వక్ సేన్‌తో కలిసి నటించిన 'ఫంకీ' సినిమా ఆశించిన స్థాయిలో విజయాన్ని అందుకోకపోయినా, వరుస అవకాశాలతో తన కెరీర్‌లో ముందుకు సాగుతోంది. తాజాగా తన అధికారిక ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలో 'ఇన్నాళ్లకు పెండింగ్‌లో ఉన్న ఫొటోలన్నీ బయటకు వచ్చాయి' అనే క్యాప్షన్‌తో ఆస్ట్రేలియా ట్రిప్ ఫొటోలను అభిమానులతో పంచుకుంది. ఈ చిత్రాల్లో సిడ్నీ నగర అందాలను ఆస్వాదిస్తూ ఆమె దిగిన ఫొటోలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. పర్యటనలో ఆమె ఎంచుకున్న విభిన్న దుస్తులు ఫ్యాషన్ ప్రియులను ఆకట్టుకుంటున్నాయి. ముఖ్యంగా రాయల్ కోబాల్ట్ బ్లూ రంగు కాఫ్ లెంగ్త్ ఏ లైన్ డ్రెస్‌లో కయాదు ఎంతో అందంగా కనిపించింది. స్కూప్, స్క్వేర్ నెక్‌లైన్‌తో కూడిన ఫిటెడ్ బాడీస్, ఫ్లేర్డ్ స్కర్ట్ ఆ డ్రెస్‌కు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. దీనికి లేత క్రీమ్ రంగు స్లిప్‌ఆన్ షూస్, క్లాసిక్ బ్లాక్ షోల్డర్ బ్యాగ్‌ను జత చేసి సింపుల్‌గా, ఎలిగెంట్‌గా తన లుక్‌ను పూర్తి చేసింది. ఆస్ట్రేలియా పర్యటనలోని ఈ స్టైలిష్ ఫొటోలు ప్రస్తుతం అభిమానులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి.



## చీరకట్టులో అందాల విందు

- పూల ఎంబ్రాయిడరీతో ప్రత్యేక ఆకర్షణ
- సింపుల్ లుక్‌లోనే సొగసైన అందం

అందం, అభినయంతో తెలుగు ప్రేక్షకుల్లో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న నటి శివాత్మిక రాజశేఖర్ సంప్రదాయ వస్త్రధారణలో ఆకట్టుకుంటోంది. వెండితెరపై విభిన్న పాత్రలతో తనదైన ముద్ర వేస్తున్న ఈ అందాల భామ, తాజాగా సోషల్ మీడియాలో పంచుకున్న ఫొటోలతో అభిమానుల దృష్టిని ఆకర్షించింది. లేత ఆకుపచ్చ రంగు చీరలో ఎంతో సున్నితంగా, హుందాగా కనిపిస్తూ తన ప్రత్యేకమైన ఫ్యాషన్ అభిరుచిని చాటుకుంది. లేత ఆకుపచ్చ చీరపై గులాబీ, నీలం రంగుల్లో కనిపిస్తున్న పూల ఎంబ్రాయిడరీ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. చీరకు జతగా ధరించిన లేత గులాబీ రంగు బ్లౌజ్ ఆమె రూపానికి మరింత అందాన్ని తీసుకొచ్చింది. మెడలో సింపుల్‌గా ధరించిన బంగారు ఆభరణాలు సంప్రదాయ రూపానికి చక్కని హంగును అద్దాయి. భారీ ఆభరణాలు, హడావుడి చేసే అలంకరణలకు దూరంగా, తక్కువ అలంకరణతోనే అందంగా కనిపించవచ్చని ఈ లుక్‌తో నిరూపించింది. వెనక్కి తిరిగి చూస్తున్నట్లుగా ఇచ్చిన పోజు ఫొటోకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. వెచ్చని ఇండోర్ లైటింగ్‌లో ఆమె ముఖంలోని సహజమైన హావభావాలు, చీరకట్టులోని సొగసు మరింత స్పష్టంగా కనిపిస్తున్నాయి. సంప్రదాయ దుస్తులకు ఆధునిక హంగులు జోడిస్తూ శివాత్మిక ఎంచుకున్న ఈ లుక్ ఫ్యాషన్ ప్రియులను ఆకట్టుకునేలా ఉంది. సాధారణంగా స్టైలిష్ దుస్తుల్లో కనిపించే కథానాయికలు సంప్రదాయ చీరకట్టులోనూ తమ అందంతో మెప్పిస్తుంటారు. శివాత్మిక తాజా ఫొటోలు కూడా అదే విషయాన్ని గుర్తుచేస్తున్నాయి. లేత రంగుల ఎంపిక, పూల డిజైన్, సింపుల్ ఆభరణాలు కలిపి ఆమె రూపానికి సహజమైన అందాన్ని తీసుకొచ్చాయి. సంప్రదాయ దుస్తుల్లోనూ ట్రెండీగా కనిపించాలనుకునే యువతులకు ఈ లుక్ మంచి ఫ్యాషన్ స్ఫూర్తిగా నిలుస్తోంది.

## బ్లాక్ అవుట్‌ఫిట్‌లో మెరిసిన ప్రగ్యా జైస్వాల్

- చిరుత ప్రింట్ డ్రెస్‌తో ప్రత్యేక ఆకర్షణ
- స్టైలిష్ ఫొటోషూట్‌తో అభిమానుల్లో సందడి



టాలీవుడ్ అందాల తార ప్రగ్యా జైస్వాల్ తన తాజా ఫొటోషూట్‌తో సోషల్ మీడియాలో సందడి చేస్తోంది. అందం, అభినయంతో పాటు ప్రత్యేకమైన ఫ్యాషన్ సెన్స్‌తో అభిమానులను ఆకట్టుకునే ఈ భామ, తాజాగా బ్లాక్ కలర్ అవుట్‌ఫిట్‌లో మెరిసింది. దుస్తులపై ఉన్న చిరుత ప్రింట్ ఆమె లుక్‌కు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ ఫొటోలు నెట్టింట వైరల్ కావడంతో అభిమానులు ఆమె స్టైలింగ్‌పై ప్రశంసలు కురిపిస్తున్నారు. నెటిజన్లు ఆమెను 'చీటా గాళ్' అంటూ అభివర్ణిస్తున్నారు. ప్రగ్యా ఎంచుకున్న బ్లాక్ అవుట్‌ఫిట్‌ను ప్రముఖ ఫ్యాషన్ బ్రాండ్ హ్యాంగోవర్ బై సాచి రూపొందించింది. దుస్తులపై కనిపించే చిరుత ప్రింట్ సాధారణ స్టైలింగ్‌కు భిన్నంగా ఉండటంతో ఫొటోషూట్‌కు ప్రత్యేకతను తీసుకొచ్చింది. ఆధునిక ఫ్యాషన్‌కు గ్లామర్‌ను జోడిస్తూ ప్రగ్యా తనదైన శైలిలో కెమెరా ముందు పోజులిచ్చింది. ఆమె ఎంచుకున్న దుస్తులు, ఆత్మవిశ్వాసంతో కూడిన హావభావాలు ఫ్యాషన్ ప్రియులను ఆకట్టుకుంటున్నాయి. ఈ లుక్‌కు మరింత అందాన్ని జోడించేలా మోడర్తా ఇండియా ఇయర్ రింగ్స్, హైబా జువెల్స్ రింగ్స్‌ను ప్రగ్యా ధరించింది. షోన్ జపాటో ఫుట్‌వేర్‌ను ఎంచుకుంది. ప్రముఖ సెలబ్రిటీ స్టైలిస్ట్ నటాషా బోత్రా నేతృత్వంలోని బృందం ఈ ఫొటోషూట్ కోసం ఆమె రూపాన్ని తీర్చిదిద్దింది. సంప్రదాయ దుస్తుల్లోనే కాకుండా వెస్ట్రన్ అవుట్‌ఫిట్స్‌లోనూ తనదైన ముద్ర వేస్తున్న ప్రగ్యా, ఈసారి బ్లాక్ డ్రెస్‌తో సరికొత్త స్టైల్‌ను పరిచయం చేసింది. చిరుత ప్రింట్ డిజైన్, ఆకర్షణీయమైన పోజులు, స్టైలిష్ యాక్సెసరీస్ కలయిక ఈ ఫొటోషూట్‌కు ప్రత్యేక గుర్తింపును తీసుకొచ్చాయి. దీంతో ప్రగ్యా తాజా ఫొటోలు సోషల్ మీడియాలో అభిమానుల దృష్టిని ఆకర్షిస్తున్నాయి. లైకులు, కామెంట్లతో ఆమె పోస్టులు సందడి చేస్తున్నాయి.

Printed, Published & Owned by Madala Venkata Seshagiri, Printed at BHANUPRAKASH POWER PRINTERS : H. NO. 4-9-303, USMANSAHEBPET, NAVABPET, NELLORE-254003, SPSR NELLORE DISTRICT. ANDHRA PRADESH - 516002. and Published from 27/8/423, 3RD BIT NTR NAGAR, NEAR CPM PARTY OFFICE, SRI POTTI SRIRAMULU NELLORE, ANDHRA PRADESH - 524003. Editor, Mandala Venkata Seshagiri, RNI Regd. No : APTEL/2012/45871, Cell: 93980 90609, 8500008668 idhinijamNellore @gmail.com